J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 8 28.7.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం!




## కాగడా పెట్టి వెతికినా.. కనపడని ఆదాయం

## రాష్ట్ర భవిష్యత్ అయోమయం

## అప్పుల్లో కాదు... అభివృద్ధిలో పోటీ పడాలి

## పార్లమెంటులో గళమెత్తి.. గండాన్ని గట్టెక్కించాలి

'అప్పు'.... నిరుపేద నుండి నీరవ్ మోడీ వరకు ఎవరినైనా వెంటాడి వేధించే పదం ఇది. ప్రపంచంలో, ముఖ్యంగా భారతదేశంలో వ్యక్తుల ద్వారా, సంస్థల ద్వారా లేదా బ్యాంకుల ద్వారానైనా అప్పు చేయనివారు బహు అరుదు. అలా ఏ విధంగా అప్పు చేయకుండా ఉండే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే.. ఆ మనిషికంటే అదృష్టవంతులు ఇంకెవరూ ఉండరు. తమ వ్యాపారం కోసం, సంస్థల కోసం ఏదో ఒక రూపంలో అప్పుచేయని వ్యాపారవేత్త ఉంటే అసలు ఆయన సమర్థత కలిగిన వ్యాపారవేత్తే కాదు. అంతటిస్థాయిలో మనిషి జీవితంతో 'అప్పు' పెనవేసుకుపోయింది. ఋణం అనే పదం లేకపోతే అసలు బ్యాంకింగ్ వ్యవస్థే ఉద్భవించి ఉండేది కాదేమో...! గల్లీలో ఉండే కిళ్ళీకొట్టు నుండి అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలుచేసే అంబానీ, అదానీలు సైతం బ్యాంకుల పైన ఋణాల కోసం ఆధారపడాల్సిందే. ఇదీ 'అప్పు'కి ఉన్న మహిమ.

దేశంలో, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాలు కూడా అప్పు చేయాల్సిందే. అది జాతీయ పార్టీయా, ప్రాంతీయ పార్టీయా అన్న తేడాలు ఉండవు. అందరిదీ ఒకే బాట. కాకపోతే... కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే కేంద్రం నుండి ప్రాధాన్యతతో కూడిన అధిక నిధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. తమ రాష్ట్రంలో ఉన్న వనరులు, వసతుల ద్వారా వచ్చే ఆదాయం, వివిధ రూపాలలో ప్రజల దగ్గర నుండి ప్రభుత్వం వసూలు చేసే పన్నులు, వీటితో పాటు కరెంటు వాడకం, పెట్రోలు, డీజల్, మద్యం వంటివాటిపైన వచ్చే ఆదాయం వంటివి ప్రభుత్వాలకి ప్రధాన ఆదాయ వనరులు. తమకు వచ్చే ఆదాయాన్ని బట్టి, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ రూపొందించుకుంటాయి. రాష్ట్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు... అంటే, ముఖ్యంగా ప్రజలకి అవసరమైన రోడ్లు, విద్య, వైద్యం, పేదలకు ఇళ్ళు, వ్యవసాయం కోసం నీటిపారుదల ప్రాజెక్టులు.. ఇలాంటివి ప్రధాన అంశాలుగా పెట్టుకుంటాయి. ఇక వృద్ధాప్య పింఛన్లు, పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్లు.. ఇవన్నీ కూడా సర్వసాధారణమే.

గడచిన 4 దశాబ్దాల కాలంలో... క్రమేణా రాజకీయాలు మారుతూ వస్తున్నాయి. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం, ప్రజలపై వాటి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. దక్షిణ భారతదేశంలోని రాజకీయపార్టీలను గమనిస్తే ప్రజలకి ఉచిత తాయిలాలు ఇవ్వడం అలవాటు చేసింది ప్రప్రథమంగా తమిళనాడు రాష్ట్రమే. అక్కడ టీవీలతో మొదలుపెట్టి గ్యాస్‌స్టౌలు,

10లో

CLEARANCE SALE

FLAT 25% OFF

శ్రీ సాయి కంచి

రోడ్ నెం.2, 2వ మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్,
నెల్లూరు. సెల్ : 8919714848.





# మణిపూర్ హింసలపై నిరసనలు

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అమానుష హింసలపై జిల్లాలోని మండల కేంద్రమైన బోగోలులో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యంత హేయంగా అత్యాచారం చేసిన దుండగులను ఉరితీయాలని పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ నిరసనకారులు ఈనెల 22న పెద్ద ఎత్తున ప్రదర్శన చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక గిరిజనులు, దళితులపై దారుణ మారణకాండలు పెరుగుతున్నాయని, మణిపూర్ హింసలు ప్రపంచదేశాల ముందు భారత్ తలదించుకునేలా ఉన్నాయని వారు దుయ్యబట్టారు. మన రాష్ట్రంలోని ఒంగోలులో కూడా ఇటీవల ఒక గిరిజనుడిపై కొందరు దుండగులు కిరాతంగా దాడిచేసి మూత్రం పోశారని, ఇంత ఘోరమైన దాడులు జరుగుతున్నా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆ దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. బోగోలులోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వద్ద జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి, మానవహక్కుల సంఘం ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షుడు దాసరి సునీల్, ప్రజాసంఘాల నాయకులు మిట్టా అశోక్, నూరుద్దీన్, సుభాని, నిర్మల్‌కుమారి, సురేష్, రమణయ్య పాల్గొన్నారు.

## శ్రీపీఠం ఆధ్వర్యంలో..

# శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వ్రతం




నెల్లూరులోని మైపాడుగేటు వద్దనున్న కెవిఆర్ కల్యాణమండపంలో ఈనెల 22న శ్రీ పీఠం వారి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వ్రతం ఎంతో వైభవంగా జరిగింది. లలితా శివకుమారస్వామి, పీవికె ఆర్ఎస్ శర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో విష్ణు సహస్రనామ పారాయణంతో పాటు స్వామివారి భజనలతో భక్తులు పరవశించారు. ఈ వ్రతంలో దాదాపు 500 మందికి పైగా పాల్గొనగా, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం, నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు.

# గణపం సేవలు గణనీయం

- కొనియాడిన నాయకులు



జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి అలుపెరుగని ప్రజాసేవకుడని, ఏళ్ల తరబడిగా ఆయన ప్రజలకు చేస్తున్న సేవలు గణనీయమని మాజీ వైకాపా కన్వీనర్ మలిరెడ్డి విజయకుమార్ రెడ్డి తదితర నాయకులు ప్రశంసించారు. ఈనెల 22న గణపం బాలకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా వింజమూరులో స్థానిక వైకాపా నాయకులు ఆయనచే కేకు కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహరహం పోరాడే బాలకృష్ణారెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో ఎంతో ఎత్తుకు ఎదగాల్సిన వారని, అయినా ఆయన తన గురించి పట్టించుకోకుండా, రాజకీయాలకు కులమతాలకు అతీతంగా ఎక్కడ ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వారి కష్టాలు తీర్చేందుకు ప్రయత్నిస్తుండడం ఆయన నైజమని అంటూ, అలాంటి ఉత్తమ నాయకుడు బాలకృష్ణారెడ్డి రాజకీయాల్లో మార్గదర్శకమన్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ గణపం కృష్ణారెడ్డి, చాకలికొండ ఎంపీటీసీ సభ్యులు దేగా వంశీ, వైకాపా సోషల్ మీడియా సభ్యులు శివారెడ్డి, జిలానీ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



## రుద్రకోటలో మహాశక్తి మహిళల

# ఇంటింటి ప్రచారం



కావలి రూరల్ మండలంలోని రుద్రకోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు సూచనలతో తెలుగుదేశం పార్టీకి చెందిన మహాశక్తి మహిళలు ఈనెల 22న ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతను వారు గ్రామస్తులకు వివరించారు. కావలి టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, కొల్లూరు అశ్వని, పసుపులేటి పద్మ, రాధమ్మ, శ్రీదేవి, రుద్రకోట టిడిపి నాయకులు తుళ్ళూరు మల్లికార్జున, పేరం రవిబాబు, దాసరి శ్రీనివాసులు, దాసు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# ఆడపిల్లలు బాగా చదువుకోవాలి

## - ఐసీడీఎస్ పీడీ హేనాసుజన



ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, తల్లితండ్రులు వారిని బాగా చదివించాలని, ప్రతిఒక్కరికి 'భేటీ బచావో-భేటీ పడావో' అనే నినాదం ఆచరణీయం కావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన చెప్పారు. ఈనెల 22న ఆమె నెల్లూరు, పొదలకూరురోడ్డులో ఉన్న జడ్పీ బాలికల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా చదువులో రాణించి సమాజంలో ఉన్నతశిఖరాలను అందుకోవాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ అనూరాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.జ్యోతిర్మయి, ఐసిపిఎస్ సిబ్బంది సమత, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలప్పుడే రాజకీయాలు

## - నెల్లూరు ఎంపీ ఆదాల

ఎన్నికలప్పుడే రాజకీయాలని, మిగతా సమయంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి పైనే తన దృష్టి కేంద్రీకరిస్తున్నానని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికలలోపు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడమే లక్ష్యంగా ఉంచుకొని ముందుకెళుతున్నామని చెప్పారు. ఎన్నికల లోగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా మాటలకంటే చేతలకే ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తానని అన్నారు. నెల్లూరు 27వ డివిజన్ ఇన్‌ఛార్జ్ సన్నపురెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 20 లక్షల రూపాయలతో రోడ్లకు, డ్రైన్లకు ఆదాల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ డివిజన్లో నాలుగు కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని తెలిపారు. మంగళవారం అమరావతిలో సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసినప్పుడు రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు ఆయన ముందుంచానని, నెల్లూరులో కొత్తగా ఏర్పాటు చేయదలచిన రింగురోడ్డుపై కూడా ముఖ్యమంత్రితో చర్చించానని, అన్నీ విన్న సీఎం సానుకూలంగా స్పందించి సహకరిస్తానని హామీ ఇచ్చారని, ఇంకాకూడా ఏమైనా అభివృద్ధి పనులు ఉంటే వాటిని కూడా పూర్తిచేయడానికి కృషిచేస్తామని తెలిపారు. ఎక్కువగా ప్రజల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించామని తెలిపారు.



జులై 25వ తేదీ మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలసి నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించిన నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# వీపీఆర్ దంపతుల 'వాత్సల్యం'

## అనాథల దాహం తీరుస్తున్న దాతలు



రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దాతృత్వం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. దాతృత్వం, ఆధ్యాత్మికతత్వం అంటే ఈతరం నెల్లూరోళ్ళకి ముందుగా గుర్తొచ్చేది ప్రభాకరరెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులే. అనాధలకు, వృద్ధులకు అనాదిగా ఆశ్రయమిస్తున్న 'జనహిత వాత్సల్య'కి చిర కాల దాత ప్రభాకరరెడ్డి. గత కొన్నేళ్లుగా ఆ అనాధల ఆలయానికి ప్రతియేటా ఆర్థిక సహాయం అందిస్తూనే ఉన్నారు. అంతేకాకుండా ఆశ్రమానికి అవసరమైన మంచినీటిని కూడా తమ సంస్థ ట్యాంకర్ ద్వారా నిత్యం సరఫరా చేయిస్తుండేవారు. అయితే, ఇటీవల తమ ట్యాంకర్లకు నీరు అందించే బోర్లలో నీళ్ల రావడంలేదని, అందుచేత వాత్సల్యకు నీరు చేరడం లేదన్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. అంతే, సమస్య తనకు తెలియగానే ఆయన తక్షణమే స్పందించారు. మరోచోట రెండు కొత్తబోర్లు వేయించారు. వాత్సల్యకి ఎలాంటి ఇబ్బంది రాకుండా నీరు సరఫరా చేయాలని తమ సిబ్బందికి సూచించారు.

ఇప్పుడు కొత్త బోర్లద్వారా వాత్సల్యకి నీరు అందుతోంది. తమ సమస్యని ప్రభాకరరెడ్డి దృష్టికి తీసుకురాగానే ఆయన స్పందించిన తీరుకి వాత్సల్య నిర్వాహకులు ఆనందభరితులై పోయారు. తమకి కొండంత అండగా నిలుస్తున్న ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రొట్టెల పండుగ ఏర్పాట్లు భేష్



నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ ఏర్పాట్లు చక్కగా జరుగుతున్నాయని ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. బారాషహీద్ దర్గాలో బుధవారం సాయంత్రం రొట్టెల పండుగ కోసం చేస్తున్న ఏర్పాట్లను కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి ఆదాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు పది లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో దర్గాలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈనెల 29 నుంచి ఆగస్టు 2వతేదీ వరకు జరిగే రొట్టెల పండుగను విజయవంతం చేసేందుకు కార్మికులు రేయింబవళ్ళు కష్టపడుతున్నారని చెప్పారు. దర్గాకు వచ్చే భక్తుల స్నానాలు, దర్శనాలకు ప్రత్యేకమైన ఏర్పాట్లను చేశా మని, దర్గాను పరిశుభ్రంగా ఉంచుతున్నా మన్నారు. ఈ కార్యక్రమం విజయానికి అందరూ సహకరిస్తున్నారని సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, కార్పొరేషన్ ఉప మేయర్ రూప్ కుమార్ యాదవ్, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ మీరా తదితరులు పాల్గొన్నారు.



## ఆదాలకు దర్గా కమిటీ సన్మానం

రొట్టెల పండుగ కోసం కొత్తగా ప్రకటించిన బారాషహీద్ దర్గా కమిటీ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో సన్మానించారు. రాష్ట్ర పండుగలో బాధ్యతాయుతమైన కమిటీ సభ్యులుగా తమను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



నెల్లూరు నగర కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ జులై 25వ తేదీ మంగళవారం నాడు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలిశారు. నగరంలో ఏర్పాటవుతున్న జగనన్న భవన్, నగర రాజకీయాలలో కొత్త సమీకరణలు, తదితర అంశాలు వీరిద్దరిమధ్య చర్చకి వచ్చినట్లు సమాచారం.

జిల్లా రాజకీయాలలో పలు కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్న తరుణంలో జగన్‌తో రూప్‌కుమార్ భేటీ రాజకీయవర్గాలలో చర్చనీయాంశమయ్యింది.

# ఇరుకళల అమ్మ ఆలయానికి టీటీడీ బృందం

## • ఘటికుడు శీనయ్య

నెల్లూరు నగర గ్రామదేవత ఇరుకళల అమ్మవారి ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. 11వ శతాబ్దంలో నిర్మింపబడిన ఈ ఆలయంలోని ఇరుకళల అమ్మవారు నగర గ్రామదేవతగా ప్రసిద్ధి. ఈ గుడి ధర్మకర్తలమండలి ఛైర్మెన్‌గా బాధ్యతలు తీసుకున్న రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) ఈ ఆలయ అభివృద్ధి కోసం శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయమని టీటీడీ ఛైర్మెన్ వై.వీ.సుబ్బారెడ్డిని కలిసి అభ్యర్థించిన విషయం విదితమే. 2.53కోట్ల అంచనాలతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనని ఆర్ఎస్ఆర్, సుబ్బారెడ్డి ముందుంచారు. శీనయ్య అభ్యర్ధనకి సానుకూలంగా స్పందించిన వై.వీ.సుబ్బారెడ్డి టీటీడీ బృందాన్ని నెల్లూరుకు పంపారు. జులై 26వతేదీ టీటీడీ బోర్డు కార్యనిర్వహణ 5 జిల్లాల జోనల్ అధికారి ధిల్లీరెడ్డి, జిల్లా కార్యక్రమాల నిర్వహణ అసిస్టెంట్ స్వామి, స్థానిక ధార్మిక మండలి సభ్యులు జయరామయ్యలు ఆలయాన్ని సందర్శించి శీనయ్య ఇచ్చిన ప్రతిపాదనలపై వాకబుచేశారు. ఆలయ అవసరాలను ఛైర్మెన్ దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరలో శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరుచేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. టీటీడీ బృందం ఆలయాన్ని సందర్శించడం ఆనందదాయకమని, వైసీపీ నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్, పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి సూచనలమేరకు వై.వీ.సుబ్బారెడ్డిని కలిసి అమ్మవారి ఆలయ అభివృద్ధికి వారి సహకారాన్ని అభ్యర్థించడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించి వారి బృందాన్ని పంపడం శుభపరిణామంగా భావిస్తున్నానని ఆలయ ఛైర్మెన్ శ్రీనివాసరావు చెప్పారు. టీటీడీ బృందం సభ్యులతో పాటు ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. మొత్తానికి తాను అనుకున్నది సాధించుకుంటున్న శీనయ్య ఘటికుడే.



## జగనన్న విదేశీ విద్యా దీవెన

# జిల్లా వాసులకు రూ.2.60 కోట్లు విడుదల



విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న ఆంధ్ర విద్యార్థినీవిద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న విదేశీ విద్యాదీవెన' కార్యక్రమంలో భాగంగా జులై 27వ తేదీ గురువారం నెల్లూరుజిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి 2.67 కోట్ల రూపాయల నిధులను వర్చ్యువల్‌గా విడుదల చేశారు. తాడేపల్లి నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ముఖ్యమంత్రి, సహాయం మొత్తాన్ని అందించిన అనంతరం సహాయం అందుకున్న నెల్లూరుజిల్లాకు చెందిన 19 మంది విద్యార్థినీవిద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. వారితోపాటు సహాయం అందుకున్న విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

లాయర్
జులై 28, 2023

# నిందల పాలవుతున్న వ్యవస్థలు

దేశంలోని అనేక రాష్ట్రాలలో బలమైన ప్రాంతీయపార్టీల హవా నడుస్తోంది. ఆయా రాష్ట్రాలలో వాళ్ళు చెప్పిందే వేదం, వారు చేసిందే శాసనం. ఇలాంటి తరుణంలో అనాదిగా భారత దేశంలో రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్న అనేక వ్యవస్థలు నిందలపాలై ప్రజల దృష్టిలో చులకనైపోవడం విచారకరం. తాము చేసిన, చేస్తున్న తప్పులను సమర్ధించుకోవడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న సంస్థల్ని తప్పుపట్టడమే కాకుండా, సంబంధిత సంస్థల అధికారుల సమర్ధతను కూడా అనుమానించే విధంగా ప్రవర్తిస్తుండడం ఇటీవల కాలంలో సర్వసాధారణమైపోయింది. కొన్ని సందర్భాలలో సుప్రీం కోర్టు నిర్ణయాన్ని కూడా బహిరంగంగా విమర్శిస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టింగులుపెట్టే స్థాయికి ప్రాంతీయపార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు బరితెగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన వై.ఎస్.వివేకానంద రెడ్డి హత్య ఉదంతంలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ సిబిఐ ఇలాంటి నిందలు ఎదుర్కోవడం ఇక్కడ గమనార్హం. ఈ కేసులో ముఖ్యమంత్రి సమీప బంధువు అవినాష్‌రెడ్డి పేరుని ఛార్జ్‌షీట్‌లో చేర్చడం ఆ పార్టీ తప్పుపడుతోంది. సిబిఐ సమర్ధతపై అనుమానాలు కలిగే విధంగా పార్టీ నాయకులు స్పందిస్తున్నారు. ప్రధానంగా వైసీపీ ముఖ్య సలహాదారే నేరుగా మీడియా ముందుకి వచ్చి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థను తూర్పారబట్టారు. ఆయన ప్రభుత్వ సలహాదారు హోదాలో మాట్లాడి ఉంటే ఆ మాటలు ప్రభుత్వం మాట్లాడినట్లే భావించాలి. అలాకాకుండా ఆయన వ్యక్తిగతంగా మాట్లాడి ఉంటే తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల విషయంలో కూడా ఆయన సిబిఐ దర్యాప్తును తప్పుబడుతున్నట్లే అనుకోవాలి.

అనేక సందర్భాలలో న్యాయవ్యవస్థ నిర్ణయాలను కూడా వైసీపీ తప్పుపట్టింది. ఒకానొక దశలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకాన్ని కూడా అడ్డుకునే ప్రయత్నం ఆ పార్టీ చేసింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో వైసీపీకి మంచి స్నేహ సంబంధాలే ఉన్నాయి. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఒక్క ప్రత్యేకహోదా విషయంలో తప్ప, మిగిలిన పనులన్నీ ఢిల్లీలో వైసీపీ చక్కబెట్టుకుంటూనే ఉంది. అలాంటప్పుడు ఒక్క వైఎస్ వివేకా హత్య వ్యవహారంలో మాత్రం కేంద్రం తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని చెప్పుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పార్టీలు, వ్యక్తులు తమ వ్యక్తిగత స్వార్ధంతో స్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవస్థలు, సంస్థల సచ్ఛీలతను దెబ్బతీసే ప్రయత్నం చేయడం సబబు కాదు. అలా తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే సీఐడీ విభాగాన్ని కూడా ప్రభుత్వ జేబులో సంస్థగా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దానికి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవలసి వస్తోంది. దేశంలోని అనేక ఇతర రాష్ట్రాలలో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని, భారతీయ జనతా పార్టీని తీవ్రంగా వ్యతిరేకించే ప్రాంతీయపార్టీలు చాలానే ఉన్నాయి. అవికూడా ఇదే పోకడ పోతున్నాయి. తమను వ్యతిరేకించే పార్టీలపైనా, వ్యక్తులపైనా కేంద్ర పెద్దలు సిబిఐని ప్రయోగిస్తున్నాయని ఆరోపిస్తున్నాయి. నిజంగా తమని వ్యతిరేకించేవారిపైనే భాజపా సిబిఐ అస్త్రాన్ని ప్రయోగించే పనైతే వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డి పేరు పెట్టుండే ప్రసక్తే ఉండకపోయుండొచ్చు. అంతటి స్థాయిలో వైసీపీకి భాజపాకి స్నేహ సంబంధాలు ఉన్నాయన్న విషయం బహిరంగ రహస్యమే.

ఇదే రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంఘటనలలో సిబిఐ దర్యాప్తు కావాలని అసెంబ్లీలలో ధర్నాలు, నిరసనలు చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సమర్ధతపైన, సదరు ప్రభుత్వ అధికారులపైన నమ్మకం లేనప్పుడు నిష్పక్షపాత దర్యాప్తు కోసం సిబిఐని ఆశ్రయించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. దర్యాప్తు తమకు అనుకూలంగా ఉంటే సిబిఐ దర్యాప్తు అమోఘం అని కీర్తించి, అదే దర్యాప్తు తమకు ప్రతికూలంగా ఉంటే సిబిఐ పక్షపాతంతో వ్యవహరిస్తుందని విమర్శించడం ఎంతవరకు సమంజసమో అన్ని పార్టీలు ఆలోచించుకోవాలి. సిబిఐకి మించిన దర్యాప్తు సంస్థ భారతదేశంలో లేదు, అంతటి ఉన్నత దర్యాప్తు సంస్థకే రాజకీయ బురద పూస్తే.. ఇక ఇలాంటి వ్యక్తులు పార్టీల కోసం మరో కొత్త దర్యాప్తు సంస్థని ప్రారంభించాలేమో...! లేదంటే 'రా'(RAW రీసెర్చ్ & అనాలసిస్ వింగ్)ని రంగంలోకి దించాలి.

'మోకాలికి బోడిగుండుకీ ముడిపెట్టినట్లుగా'.... వ్యవస్థలకు, రాజకీయాలకి ముడిపెట్టి మాట్లాడడం ఎవరికీ మంచిది కాదు. సమాజ హితంకోసం నిష్పక్షపాతంగా పనిచేసే వ్యవస్థగా మనం న్యాయవ్యవస్థపై నమ్మకం పెట్టుకున్నాం. అదే సమయంలో నిజాలను నిగ్గుతేల్చే నిఖార్సైన సంస్థగా సిబిఐని అనాదిగా చెప్పుకుంటూ వస్తున్నాం. ఇప్పుడు ఆ వ్యవస్థలనే తప్పుపట్టి, వాటిని నిందలపాలు చేస్తే భవిష్యత్తులో ధర్మం బరువై, న్యాయం కరువైపోవడం ఖాయం... సమాజ భవిష్యత్తుకి ఈ ధోరణి మంచిదికాదు...!

## నాలుగు చినుకులకే.. కరెంటు కష్టాలు

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

నెల్లూరు పట్టణం నగరంగా అవతరించి ఇరవైఏళ్ళు కావస్తోంది. నగర విస్తీర్ణం పెరిగింది. జనావాసాల పరిధి విస్తరించింది. అంతకంతకు జనాభా సంఖ్య కూడా అపారంగా పెరుగుతూపోతోంది. కానీ నగరవాసుల బ్రతుకులు మాత్రం ఇంకా దీనావస్థలోనే ఉన్నాయి. జిల్లాలో ఏడాదిలో 10 నెలలు ఎండలే ఉంటాయి. మిగిలిన కాలంలో చలి, వానలు. అయితే, వానాకాలం వస్తోందంటే జిల్లా వాసులకు కరెంటు కష్టాలు మొదలవ్వాల్సిందే. ముఖ్యంగా నగరంలో పరిస్థితి మరీ అధ్వాహ్నంగా ఉంది. కొద్దిపాటి గాలి, వర్షం వస్తే కరెంటు పోతుంది. విద్యుత్ శాఖ వారికి కాల్‌చేస్తే కొమ్మలు పడ్డాయి.. వైర్లు తెగాయి... అంటూ గంటలకొద్దీ సమయం తీసుకుని మళ్ళీ కరెంటు ఇస్తారు. మాములు రోజుల్లో ఈ శాఖ ఉద్యోగులు ఏం చేస్తుంటారో అర్ధం కాదు. చిన్నపాటి గాలి, వర్షానికే కరెంటుకి అంతరాయం కలిగించే చెట్లను గుర్తించడం ఆ శాఖవారికి పెద్ద విషయం కాదు. మిగిలిన రోజుల్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకుండా ఇబ్బందికరమైన కొమ్మలని తొలగించే ప్రక్రియ చేపట్టొచ్చు. బిల్లు కట్టడం ఆలస్యమైతే ఫీజులు పీకేస్తాం... అంటూ వినియోగదారుడి పీకపట్టుకునే విద్యుత్‌శాఖ ఉద్యోగులు... తుప్పర వానకే సరఫరాకి అంతరాయం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు కూడా తీసుకుంటే బాగుంటుంది...!

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

## వెంకటగిరిలో జగన్ నైజం బయటపడింది

ఇటీవల వెంకటగిరిలో జరిగిన జగన్‌మోహన్‌రెడ్డి సభకి జనం భారీగా వచ్చారు. మా పెద్దాయన నేదురుమల్లి జనార్ధనరెడ్డి కొడుకు రామ్‌కుమార్‌రెడ్డి ఒక్కసారిగా మా అందరికి పెద్దాయనని గుర్తుకు తెచ్చారు. ఆయన కూడా అంతే... ఏదైనా అనుకుంటే నిద్రపోయేవారు కాదు. చేసే పని ఏదైనా బాగా చేయాలన్నది ఆయన నైజం. అదే గుణం ఆయన కొడుకుకి కూడా వచ్చింది. వారం రోజులు బాగా కష్టపడి ముఖ్యమంత్రి ప్రోగ్రామ్‌ని ఘనంగా చేశారు. ఇంతకముందు ఇంత జనాలు ఏ సభకి రాలా.

కానీ ఇక్కడ ఒక్క విషయం మా పెద్దాయన అభిమానులందరినీ బాగా బాధపెట్టింది. జనార్ధనరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పెద్దాయన గురించి నాలుగు ముక్కలు మాట్లాడివుంటే బాగుండేది. ఆయన కూడా వాళ్ళ నాయనలాగా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసినోడే. అంతేకాదు, ఆయన బతికున్నన్ని రోజులూ నెల్లూరుజిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి పెద్దదిక్కుగా ఉండేవారు. తన రాజకీయ జీవితం మొత్తం ఒకే పార్టీకి అంకితం చేసిన గొప్పనాయకుడు జనార్ధనరెడ్డి. అలాంటి నాయకుడి విగ్రహం ఆవిష్కరించి, ఆయన గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా సీఎం వెళ్లిపోవడం మాలాంటి పెద్దాయన అభిమానులందరిని బాధపెట్టింది. తమ నాయనకి సమకాలీకుడైన జనార్ధనరెడ్డి గురించి జగన్ మాట్లాడకుండా వెళ్ళిపోయినంత మాత్రాన మా పెద్దాయన విలువ తగ్గేదేమీ కాదు. జగన్‌మోహన్‌రెడ్డి నైజం మాత్రం బయటపడిపోయింది.

కె.విశ్వనాథం, డక్కిలి.

# వాస్తవిక జీవితానుభవాల జ్ఞాపకాలే... 'నడిచొచ్చిన దారంతా'

నెల్లూరుకు చెందిన పాతూరి అన్నపూర్ణ వృత్తిరీత్యా ఉపాధ్యాయిని. ప్రవృత్తిరీత్యా కవయిత్రి. 5 కవితాసంపుటాలను ఇప్పటికే వెలువరించిన ఈమె ఒక కథా సంకలనాన్ని, 'సింహపురి పర్యాటకదర్శిని' అనే టూరిజం గైడ్‌ను ప్రచురించారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘానికి, నెల్లూరుజిల్లా రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగాను వ్యవహరిస్తూ సాహితీ సృజనతో పాటు సాహితీ సేవనూ కొనసాగిస్తున్నారు.

హృదయంతో లోకాన్ని చూడడమే కవిత్వం. అందుకే 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అన్నారు ఆలంకారికులు. అన్నపూర్ణ కవిత్వంలో సామాజిక స్పృహ అధికం. అంతేగాక సమాజ హితం, సందేశాత్మకంగాను ఆమె కవిత్వం పరిపూర్ణత్వాన్ని సిద్ధింపజేసుకుంటోంది. అందుకు ఉదాహరణలు కొన్నింటిని చూద్దాం. 'నడిచొచ్చిన దారంతా' అని ఆమె తన కావ్యానికి పేరు పెట్టడంలోనే తన జీవితకాలంలో తాను చూసిన, విన్న, చదివిన, అనుభవించిన సంఘటనల తాలూకు సారాంశం ఇందులో ఇమిడ్చి కవిత్వాన్ని వెలయించిందని ఊహించవచ్చు.

'మనిషి నడవాలంటే/రెండు పాదాలు జతకట్టాలి/ అనుకున్న చోటికి వెళ్లాలంటే/మనసు పయనమవ్వాలి' – అంటూ మొదటి కవితలోనే రాశారు ఆమె. అంటే 'జీవితం' మీద పూర్తి అవగాహనతో ఆమె కవిత్వాన్ని సృజిస్తున్నదని తెలుస్తుంది. "జీవితాన్ని మించిన పుస్తకం / నాకు కనపడడం లేదు" అంటారామె మరొక చోట. ఎంతటి సత్యం! పెద్దలేనాడో ఈ మాట చెప్పారు. పై రెండు ఉదాహరణలే ఈ కావ్యంలోని సారాంశం. 'తొమ్మిది నెలలు అమ్మ కడుపులో / రక్షణ కవచంలో ప్రాణం పేనుకున్న మీ రూపం / భూమి మీద పడ్డప్పటి నుండి / అభద్రతా వలయాల మధ్యనే/ ఏ సమయంలోనైనా / రక్తపుష్పాల్లో రాలిపోవాల్సిందే/ అంటూ ఇటీవల చిన్నారులు లైంగిక అఘాయిత్యాలకు గురవుతున్న విషయాన్ని హృదయ విదారకంగా చెప్పారు కవయిత్రి. కంటతడి పెట్టించారు.

నాగరికత, విజ్ఞానం తెచ్చిన ఆధునిక పరికరాలు యువతను ఎలా పాడుచేస్తున్నాయో చెపుతూ కవయిత్రి ఆందోళనను ఇలా వ్యక్తం చేస్తున్నారు. 'గుడి లాంటి బడులలోనూ / విచ్చలవిడిగా వాడుతున్న మొబైల్స్ / విద్యార్థుల మెదళ్లను చెదపట్టిస్తున్నాయి / వెన్నెల నింపుకునే వాళ్ల కళ్లు / వేటకొడవళ్లుగా మారి అమ్మాయిల అంగాంగాలను స్పృశిస్తున్నాయి' అంటూ ఆందోళన చెందారు.






నడిచొచ్చిన దారంతా...
రచయిత్రి:
డా॥ పాతూరి అన్నపూర్ణ
పేజీలు : 141 వెల. 200/-
ప్రతులకు : డా॥ పాతూరి అన్నపూర్ణ
1156-28-1, ప్రశాంతి నగర్,
నవలాకుల గార్డెన్, నెల్లూరు - 524 002.
మొబైల్ : 94902 30939.

అందరూ 'తల్లి' గొప్పదనాన్ని గురించి రాస్తారు. ఈ కవయిత్రి తల్లి గొప్పదనంతో పాటు తండ్రి గొప్పదనాన్ని ఇలా చెప్పారు 'వారసత్వం' అనే గేయంలో. 'విశ్వ సంరక్షణ చేసే ఈశ్వరునికన్నా / తక్కువవాడేం కాదు మా నాన్న / కుటుంబం కోసం ఎన్నో త్యాగం చేసిన మా నాన్న / తనని తాను పోగొట్టుకున్నాడు' అంటుంది.

మానవ సేవే మాధవ సేవ అన్న నిజాన్ని గురించి ఆమె 'కడుపున పుట్టిన బిడ్డకు అమ్మానాన్నలవడం సహజం / ఈ అనాధలకు అమ్మానాన్నలుగా నిలబడడం మానవత్వం / అదే దైవత్వం అంటారు. ఇలా చెప్పుకుంటూ పోతే అంతం ఉండదు. ఆమె ప్రతి కవితా ఒక సందేశాత్మక బోధన!!

సాహితీ సృజన, సారస్వత సేవ రెండూ రెండు కళ్లుగా భాసిల్లే అన్నపూర్ణ మరిన్ని మంచి కవితా సంపుటాలు వెలువరించాలని కోరుకుందాం!



డాక్టర్ గంగిశెట్టి శివకుమార్
సెల్ : 9441895343

## గ్రామీణ రోడ్ల గతి ఇంతేనా?

జిల్లాలో చాలాచోట్ల రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాలంటే నరకం కనపడుతోంది. ఆర్టీసీ బస్సుల్లో, ఆటోల్లో, ద్విచక్ర వాహనాలలో ప్రయాణం చేసే గ్రామీణ ప్రాంత ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లవద్దకే చేరుస్తున్నాం అంటూ వస్తున్న వాలంటీర్ల దృష్టికి కూడా ఈ రోడ్ల సమస్యను ఎన్నిసార్లు తీసుకొచ్చినా స్పందించడం లేదు. రోడ్లు, మౌలిక వసతులు లాంటి సదుపాయాల పని తమది కాదని తప్పించుకుంటున్నారు. ముఖ్యంగా, మనుబోలు నుంచి పిడూరు రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. గత కొంతకాలంగా ఈ రోడ్డు వాహనాలు నడవలేనంతగా గుంతలు పడిపోయింది. ఇదే రోడ్డు మీద వివిధ శాఖల అధికారులు కూడా అనేక సార్లు వస్తున్నారు, వెళుతున్నారు. కానీ, రోడ్డు దుస్థితిని మాత్రం పట్టించుకోవడం లేదు. అందులోనూ ఇప్పుడు కురుస్తున్న వర్షాలకి ఈ రోడ్డు ఇంకా పరమ అధ్వాన్నంగా తయారైంది. ఇకనైనా జిల్లా అధికారులు పట్టించుకోవాలని మనవి.

– ఎన్‌వి శేషాచలం, మనుబోలు.

# అన్నమయ్య గొప్ప సామాజిక సంస్కర్త

## --- శ్రీసిటీ సాహిత్య సదస్సులో భూమన్ ---



ప్రముఖ కవి, తెలుగు పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు 15వ శతాబ్దంలోని ఓ గొప్ప సామాజిక సంస్కర్త అంటూ శ్వేతా మాజీడైరెక్టర్, ప్రముఖ రచయిత భూమన్ (సుబ్రహ్మణ్యంరెడ్డి) అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఈనెల 22న శ్రీసిటీలో 'అన్నమయ్య-సామాజికత' అనే అంశంపై భూమన్ ప్రసంగించారు.

అన్నమయ్య సామాజిక దృక్పథం గురించి వివరిస్తూ, సంకీర్తనల ద్వారా సమాజంలోని ప్రజలందరి సమానత్వం కోసం అన్నమయ్య ఎంతగా కృషిచేశారో విశదీకరించారు. సంగీత సాహిత్యాలను మేళవించి సూక్తిరత్నాలను అందించిన వాగ్గేయకారులలో అన్నమయ్య అగ్రగణ్యులని, ఆయన కేవలం భక్తి కవి కాదు. భక్తి మార్గం ద్వారా సంఘ సంస్కరణకు, సామాజిక చైతన్యానికి పాటుపడిన ప్రజాకవి అని చెప్పారు. ప్రజల్లో భక్తిభావాన్ని పెంపు చేస్తూనే సామాజిక చైతన్యం తీసుకురావాలని ఆరాటపడ్డారని తెలిపారు. శిష్ట, జానపద సంస్కృతిని కాపాడుతూనే జనజీవనానికి సంబంధించి ఎన్నో సంకీర్తనలు రాశారని, సుమారు 32 వేల పద కవితలు రాసి, ఆలపించి 'పదకవితా పితామహుడి'గా వినుతికెక్కారన్నారు. శ్రీవాణి వేదిక అన్నమయ్య సామాజిక కీర్తనలకు ప్రాధాన్యత ఇస్తూ వినూత్న కార్యక్రమం చేపట్టడాన్ని అభినందించారు. అన్నమాచార్య సామాజిక దృక్కోణానికి అనుగుణంగా భూమన్ ఎంపిక చేసిన కొన్ని కీర్తనలను టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్‌కి చెందిన గాయకులు సరస్వతీ ప్రసాద్ వీనులవిందుగా గానం చేయగా, పి.పాండురంగారావు (తబలా), శంకర్ (వయోలిన్), సురేష్ (శృతి) వాద్య సహకారం అందించారు.

అనంతరం భూమన్‌ను, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన విశిష్ట కళాకారులను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పీఆర్ఓ పల్లేటి బాలాజీ నేతృత్వం వహించారు.

# ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షునిగా.. భాస్కర్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నెల్లూరుజిల్లా శాఖ అధ్యక్షునిగా ఆత్మకూరు పరిధిలోని పేరారెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈనెల 23న నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. అదేవిధంగా, జిల్లా సంఘం గౌరవాధ్యక్షునిగా వెంకటచలపతి, ప్రధాన కార్యదర్శిగా గంగిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్నం చలపతి తదితరులు ఎన్నికయ్యారు.

# మొక్కలు నాటిన..బుచ్చి లయన్స్

బుచ్చిరెడ్డిపాళెం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23న మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పలువురు వక్తలు లయన్స్‌క్లబ్ ప్రతినిధులను అభినందించారు. బుచ్చి లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పైడా రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ బయ్యా రవికుమార్, లయన్స్ ప్రతినిధులు టి.వెంకటేశ్వర్లు, గాదంశెట్టి సత్యం, దర్శి బాలు, తన్నీరు సుధాకర్, బి.వెంకటేశ్వర్లు, తిరివీధి రాజేంద్రప్రసాద్, దర్శి చినసరసింహులు, ఇసుగూరు సుబ్బారావు, రామచంద్రయ్య, మాధవ్ తదితరులు పాల్గొని పలుచోట్ల మొక్కలు నాటారు.

# పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన బాలికల గురుకుల కళాశాలలో 2015లో చదువుకున్న విద్యార్థినులు ఎనిమిదేళ్ల తర్వాత ఈనెల 23న ఆ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, కళాశాల చదువుల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందించారు. అనంతరం తమకు చదువు చెప్పిన అధ్యాపకులను సన్మానించి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఛైర్మెన్ వై.వెంకటేశ్వర్లు, పూర్వవిద్యార్థినులు పూజిత, శ్యామల, శారద తదితరులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ జలేంద్రుడు, కె.మహేశ్వరయ్య, రిటైర్డ్ ఓఎస్డీ దయాకర్, గురుకులాల ప్రిన్సిపాల్స్ టి.విష్ణుప్రియ, శోభాన్విత, సుజాత, యానాదుల సంక్షేమసంఘం నాయకులు వేణుబాబు, ప్రసాద్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు, కులమతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో సీఎంగా మళ్ళీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 22న కొడవలూరు మండలంలోని పాతవంగల్లు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి గ్రామప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను అందజేసి ఆ వివరాలను తెలియజేశారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోవూరు నియోజక వర్గంలో తాను ఇప్పటిదాకా 89,940 గడపలు తిరిగానని, ఎక్కడికి వెళ్ళినా ప్రభుత్వం పట్ల, జగన్‌పట్ల ఎంతో ఆదరణ కనిపిస్తోందన్నారు. ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు అభినందిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న వెంట డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, వైకాపా మండల కన్వీనర్ గంధం శేషయ్య, ఎంపీపీ జ్యోతి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

# డీఎస్పీలకు బదిలీలు

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీల బదిలీల నేపథ్యంలో జిల్లాలోని పలువురు డీఎస్పీలను కూడా బదిలీ చేస్తూ ఈనెల 23న రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూపర్ న్యూమరిక్ డీఎస్పీలను అడ్‌హాక్ డీఎస్పీలుగా మారుస్తూ ఈ బదిలీలు చేశారు. దీంతో, నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.డి అబ్దుల్ సుభాన్‌ను నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బదిలీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆయన ఎస్‌బీతో పాటు ట్రాఫిక్ బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు. ఎస్సీఎస్టీ సెల్-2 డీఎస్పీ వై.శ్రీనివాసరావును సీఐడీకి కేటాయించారు. రైల్వే డీఎస్పీ పి. మల్లికార్జునరావును, నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డిని అదేస్థానాల్లో అడ్‌హాక్ డీఎస్పీలుగా నియమించారు. సిసిఎస్ డీఎస్పీ ఏ.శివాజీరాజును సీఐడీ డీఎస్పీగా కేటాయించి, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సీసీఎస్ విభాగాన్ని చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

# చెంగాళమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి..

## లక్ష విరాళం

తెలుగు-తమిళ ప్రజల ఆరాధ్యదైవం, సూళ్లూరుపేటలో కొలువై ఉన్న శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో నిత్యాన్న దాన పథకానికి అమ్మవారి భక్తులు వేనాటి చంద్రారెడ్డి-ఇంద్రసేనారెడ్డి సోదరులు ఈనెల 24న లక్ష రూపాయల విరాళాన్ని అందించారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నెల్లూరు రూరల్, కొత్తకాలువ సెంటర్‌లో ఉన్న బాపూజీ వృద్ధాశ్రమంలో ఉన్న సుమారు వందమంది వృద్ధులకు ఈనెల 24న దుప్పట్లు పంపిణీ చేశారు. గోపాల్‌రెడ్డి, సరోజనమ్మల జ్ఞాపకార్థం చేపట్టిన ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని వృద్ధులకు దుప్పట్లు, బిస్కెట్లు అందజేశారు. హరినాథ్‌రెడ్డి, గిరిజమ్మ, కార్పొరేటర్ నాగరాజు, కమలాకర్‌రెడ్డి, శివసునీల్‌రెడ్డి, ఏసు నాయుడు, హరిబాబుయాదవ్ పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తు కోసం లక్ష రూపాయల సాయం

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొడవలూరు మండలంలోని కొత్త వంగల్లు గ్రామంలో పర్యటిస్తుండగా ఆ ఊళ్లో కొన్ని కుటుంబాల్లో కొంతమంది తల్లిని, కొంతమంది తండ్రిని కోల్పోయిన పిల్లలను చూసి చలించిపోయారు. వారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే ఆలోచనతో కొంత డబ్బును వారి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. కొత్తవంగల్లు పంచాయతీలోని క్రిస్టియన్స్‌పాలెంకు చెందిన వట్టికల వెంకట కళ్యాణ్‌కు రూ.20 వేలు, వట్టికల వివేక్‌కు రూ.20వేలు, గాలి సాయి దీక్షకు రూ.20వేలు, గాలి లత్విక్‌కు రూ.20 వేలు, బీసీ కాలనీకి చెందిన చిట్టూరు తేజస్వినికి రూ.20 వేలు మొత్తం లక్ష రూపాయల సాయాన్ని తన తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేంతవరకు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, ఆ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## శ్రీసిటీని సందర్శించిన

# ఏపీ చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత ఈనెల 21న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు స్వాగతం పలికి, పారిశ్రామిక నగరం ప్రగతిని, తాజా పరిణామాలను వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె టోరే ఇండస్ట్రీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించడానికి వెళ్లగా, ఆ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మసాహిరో నిషిజావా ఆమెను స్వాగతించి పరిశ్రమలో ఉత్పత్తుల తయారీ విధానాన్ని వివరించారు. అనంతరం ఆమె శ్రీసిటీలోని పలు పరిశ్రమల సీఈఓలతో సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరించి, రాష్ట్రంలో సులభతర వ్యాపారం పట్ల వారి అభిప్రాయాలను కోరారు. శ్రీసిటీ యాజమాన్యం ద్వారా వారి అభిప్రాయాలు, సూచనలను క్రోడీకరించి అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

## ఐకాస విద్యార్థి నాయకులు

విద్యార్థుల సమస్యలు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటూ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) నాయకులు నెల్లూరు వీఆర్‌సి సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు మాట్లాడుతూ వైకాపా నాలుగేళ్ల పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైపోయిందని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని, ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు తీరలేదని, వసతులు మెరుగుపడలేదని, మెస్‌చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచనే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కళ్ళుతెరచి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అమ్మల్లా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ షరీఫ్, విద్యార్థి నాయకులు చైతన్య, శివం, రాకేష్, అక్షయ్, వసీం, మహేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వాహనాలు నడిపినందుకు.. జైలుశిక్ష

మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి నెల్లూరులోని మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య 3రోజుల జైలుశిక్ష విధించారు. జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్‌సుబాన్ ఆధ్వర్యంలో నార్త్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఎం.నాగేశ్వరమ్మ తన సిబ్బందితో ఇటీవల నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 12 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వారికి జైలుశిక్ష విధించడంతో, పోలీసు అధికారులు వారిని జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

# నెల్లూరు కబుర్లు

## సర్పంచ్‌ల ధర్నాందోళన



గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు లేకపోవడంతో గ్రామాల పరిస్థితి దయనీయంగా ఉందని, గ్రామీణ ప్రజలకు రోడ్లు, డ్రైయిన్లు, తాగునీటి వసతులు, విద్యుత్‌దీపాల వంటి ప్రాథమిక వసతులను కూడా కల్పించలేక నానా ఇబ్బందులు పడుతున్నామని జిల్లాలోని సర్పంచ్‌లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల సమస్యలు తీర్చాలంటూ ఈనెల 24న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌లు ధర్నాందోళన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కందముడి శివ కుమార్ మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, పంచాయతీలకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడం విచారకరమని పేర్కొన్నారు. తొలుత సర్పంచ్‌లు నగరంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.

## అక్షయ్‌కి అభినందనలు



ఇటీవల శ్రీలంకలోని కొలంబోలో జరిగిన అంతర్జాతీయ విలువిద్య పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన నెల్లూరు లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థి అక్షయ్ మహదేవ్‌ను ఈనెల 23న జిల్లా బలిజ ఉద్యోగుల సంఘం నాయకులు లక్కాకుల పెంచలయ్య ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. స్థానిక ప్రముఖులు రామిశెట్టి ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్

## సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ బిందుమీనన్



దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక సంస్థ 'ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్' సెక్రటరీ జనరల్‌గా ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ బిందుమీనన్ ఎంపికయ్యారు. ఎపిలెప్సీకి సంబంధించి 1970లో స్థాపించబడిన జాతీయ రిజిస్టర్డ్ బాడీ ఇది. జూలై 23వతేదీ రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఎపిలెప్సీ జాతీయ సదస్సులో ఆమె ఈ పదవికి ఎంపికయ్యారు. అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో న్యూరాలజీ విభాగంలో డాక్టర్ బిందుమీనన్ దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. గతంలో కూడా ఆమె అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకున్నారు. తాజాగా 'ఇండియన్ ఎపిలెప్సీ అసోసియేషన్' జాతీయ సెక్రటరీ జనరల్ పదవి ఆమెని వరించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బిందుమీనన్ మాట్లాడుతూ న్యూరాలజీ విభాగంలో తెలుసుకునే కొద్దీ జ్ఞానం పెరుగుతూనే ఉంటుందని, తన పరిశోధనలలో ఎన్నో విశేషాలు తెలుసుకోవడంతో పాటు మూర్ఛవ్యాధుల సమస్యలకి అనేక పరిష్కారాలను కూడా కనుగొనగలుగుతున్నానని చెప్పారు. ఇప్పుడు జాతీయస్థాయిలో తనకి లభించిన ఈ సెక్రటరీ జనరల్ పదవి చాలా ప్రతిష్టాత్మకమైందని, మూర్ఛవ్యాధికి సంబంధించి తాను అందిస్తున్న సేవలపట్ల తన బాధ్యతని ఈ పదవి మరింత పెంచిందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ బిందుకి 'లాయర్' అభినందనలు.



## ఉత్సాహంగా.. ఒలింపిక్ డే రన్

### --- ప్రారంభించిన మాజీమంత్రి ఆనం ---

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న నెల్లూరు ఏసీ స్టేడియంలో ఒలింపిక్ డే 4కె రన్ ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి బెలూన్లు వదిలిపెట్టి ప్రారంభించారు. స్టేడియం నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం కూడలి మలుపు తిరిగి స్టేడియం వద్దకు చేరుకునే ఈ రన్‌లో దాదాపు 500 మందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలో గెలుపొందిన ఆరుగురికి ఆనం రామనారాయణ రెడ్డి నగదు బహుమతులు అందజేసి విజేతలను అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఏడుగురు క్రీడాకారులను సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆనం మహేష్‌రెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్, ఆనం రామ కిషోర్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ యతిరాజ్‌లతో పాటు విజయకుమార్, సనత్‌కుమార్, సుంకర మధు, గాదం శ్రీనివాసులు, పావురాల వేణు, గిరిప్రసాద్, అరిగెల విజయ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## డా. బీఎస్ రావుకు నివాళి




శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు, దివంగత డాక్టర్ బీఎస్ రావు సంస్మరణ సభ ఈనెల 23న నెల్లూరు ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించారు. విద్యాసంస్థల ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశం గర్వించే విద్యావేత్త బీఎస్ రావు మృతి విద్యారంగానికి తీరని లోటని, ఆయన ఆశయాల సాధనకు కృషిచేయాలని వక్తలు పేర్కొన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎంలు శ్రీకాంత్, కొండారెడ్డి, డీన్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ సెలక్షన్ కమిటీ సభ్యునిగా..

## సీనియర్ న్యాయవాది మలిరెడ్డి



రాష్ట్ర జూనియర్ మెన్ క్రికెట్ సెలక్షన్ కమిటీ సభ్యునిగా మాజీ రంజీ క్రికెట్ ప్లేయర్, సీనియర్ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి నియమితులయ్యారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి ఆ మేరకు తాజాగా ఉత్తర్వులిచ్చారు. అండర్-14, 16, 19 క్రికెట్ జట్ల ఎంపికకు ఇంటర్, జోనల్ మ్యాచ్‌లను పరిశీలించి నివేదికలను అందజేసే బాధ్యతలను మలిరెడ్డికి అప్పగించారు.



### వైకాపా ప్రాంతీయ సమన్వయకర్తగా..

## విజయసాయిరెడ్డి

నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల వైకాపా ప్రాంతీయ సమన్వయ కర్తగా పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ విజయసాయిరెడ్డి నియమితులయ్యారు. వైకాపా అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన నియామకం జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఈనెల 24న ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఎంపీ వేమిరెడ్డిని కలసిన..ఆనం జయ



రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈనెల 22న నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఇటీవలే సిఎం సమక్షంలో వైకాపాలో చేరిన ఆనం జయకుమార్‌రెడ్డి గౌరవ పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ఆయన్ను ఆహ్వానించి గౌరవించారు. ఆనం జయ వైకాపాలో చేరడం సంతోషకరమని, జిల్లాలో సీనియర్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడని, జిల్లాలోని ప్రజలతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయని, వైకాపాను మరింత బలోపేతం చేసేందుకు ఆయన కృషి చేస్తారని వేమిరెడ్డి ఈ సందర్భంగా అన్నారు. అనంతరం జిల్లాలోని పలు రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.

## మణిపూర్ ఘటనలపై కాంగ్రెస్ ఆందోళన



మణిపూర్ హింసాకాండల ఘటనలపై నెల్లూరులోని కాంగ్రెస్‌పార్టీ జిల్లా మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానుషాలను ఖండించాలని, ఆ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే చర్యలు తీసుకోవాలని మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్ డిమాండ్ సారధ్యంలో నగరంలోని ఇందిరాభవన్ నుంచి ట్రంకురోడ్డు మీదుగా డా.అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు షేక్ దియావుల్, అల్లాభక్షు, ఆదినారాయణ, రహమతుల్లా, హైదర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 'అమీర్ అంతరంగం' పుస్తకావిష్కరణ



ప్రముఖ రచయిత, షార్ వాణి సభ్యుడు అమీర్‌జాన్ రచించిన 'అమీర్ అంతరంగం' పుస్తకాన్ని ఈనెల 23న నెల్లూరు రామ్‌నగర్‌లో ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయుడు, రచయిత ఈతకోట సుబ్బారావు అధ్యక్షత వహించగా, షార్ వాణి సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మూర్తి, శ్రీహరితో పాటు డాక్టర్ కేజే రావు, సోమరాజు, షార్ వాణి మాజీ అధ్యక్షులు డా. బి.వి.సుబ్బారావు, ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ తదితరులు అమీర్‌జాన్ రచనా వైశిష్ట్యం గురించి వివరించారు. షార్ వాణి వ్యవస్థాపకుడు డా. కె.జె రావు,, వ్యవస్థాపక అధ్యక్షులు పాలాని సోమరాజు, మాజీ అధ్యక్షులు డా. కె.కె.ఎస్.వి.వి. ప్రకాష్‌రావు, షార్ విశ్రాంత ఉద్యోగులు పి.వి. సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, డా. నాగేశ్వరరావు, శకుంతలాదేవి, జి.సూర్యనారాయణ, షార్ కాలనీ వాసులు ఎమ్.వి.రాఘవకుమార్, ధరణిజ తదితరులు పాల్గొన్నారు.






## సమాజానికి స్ఫూర్తి.. జాషువా రచనలు

### వర్ధంతిలో కొనియాడిన వక్తలు

ప్రముఖ కవి, నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఈనెల 24న గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని కేఏసీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వరరావు, అధ్యాపకులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వమానవ సమానత్వం కోసం ఆయన ఎంతగానో పరితపించారని, ఆయన రచనలు ఎంతో సుప్రసిద్ధమని వారు పేర్కొన్నారు. అధ్యాపకులు సురేష్, సుధీర్, చెంచయ్య, శ్రీనివాసులు, లైబ్రేరియన్ బసిరెడ్డి పాల్గొన్నారు.



# అదరగొట్టిన రామ్‌కుమార్‌రెడ్డి

- జనపురిగా మారిన వెంకటగిరి
- ఆనందంతో ఉక్కిరిబిక్కిరైన జగన్
- వెంకటగిరి అభివృద్ధిపై సీఎం గురి
- రూ.603 కోట్లకుపైగా వరాల సిరి



*ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జులై 21 శుక్రవారం మొదటిసారిగా వెంకటగిరి వచ్చారు. నేల ఈనిందా...? ఆకాశం పొంగిందా..?? అన్నట్లుగా వేలాది సంఖ్యలో తరలివచ్చిన అశేష జనవాహినిని చూసి ముఖ్యమంత్రి మురిసిపోయారు. జనపురిగా మారిన వెంకటగిరిని చూసి ఉక్కిరిబిక్కిరైపోయారు. అభిమానులు, కార్యకర్తల జయ జయద్వానాలతో తడిసి ముద్దైపోయారు.*



వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అడిగిందే తడవుగా ఆయన కోరికలన్నీ తీర్చేశారు జగన్. ఆల్తూరుపాడు రిజర్వాయర్ కోసం అంచనా వేసిన రూ.553 కోట్లు మంజూరు చేయడానికి హామీ ఇచ్చారు. వెంకటగిరిలో బీసీ భవన్ నిర్మాణానికి ఓకే అన్నారు. కలువాయి మండలంలో ఎస్సీ గురుకుల పాఠశాల ఏర్పాటుకి లైన్‌క్లియర్ చేశారు. గడపగడపలో ప్రభుత్వం దృష్టికి వచ్చే సమస్యలు అప్పటికప్పుడు పరిష్కరించడానికి ఒక్కొక్క సచివాలయానికి 50 లక్షల రూపాయలు ఇస్తామని భరోసా కల్పించారు. 6 మండలాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడం కోసం రూ.20 కోట్లు మంజూరు చేశారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించేశారు. జగన్ కోసం జగమంతా జనమే అన్నట్లుగా రామ్‌కుమార్‌రెడ్డి రాత్రీపగలు శ్రమించి.. వెంకటగిరిని జనపురిగా మారిస్తే, మురిసిపోయిన ముఖ్యమంత్రి వెంకటగిరిపై వరాల సిరి కురిపించి రామ్‌కుమార్‌రెడ్డిని ముగ్దుడ్ని చేశారు.

జగన్ ఆంధ్ర సీఎంగా పగ్గాలు చేపట్టేనాటికి వెంకటగిరి నెల్లూరుజిల్లాలో ఒక భాగం. ఆ తరువాత ఆ నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి వెళ్ళిపోయింది. కొంత భాగం మాత్రం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మిగిలింది. ఇదే సమయంలో వెంకటగిరి నియోజకవర్గం నుండి వైసీపీ నుండి గెలిచిన ఆనం రామనారాయణ రెడ్డి అధికార పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. ఆయన వెళ్లిపోయిన తక్షణమే నియోజకవర్గ బాధ్యతలను దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి రాజకీయ వారసుడు రామ్‌కుమార్‌రెడ్డికి అప్పజెప్పారు జగన్. అప్పటికే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్‌గా క్యాబినెట్ ర్యాంకుతో పాటు తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కూడా రామ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతున్నారు. మారుమూల కొండ ప్రాంతంలో ఉన్న వెంకటగిరి నియోజకవర్గానికి తొలిసారిగా ముఖ్యమంత్రి వస్తుండడంతో రామ్‌కుమార్‌రెడ్డి జగన్ పర్యటనని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సీఎం కార్యక్రమం ఖరారైన దగ్గరనుండి నియోజకవర్గంలోనే తిష్ట వేశారు.

ప్రధానంగా వైఎస్సార్ నేతన్న నేస్తం 5వ విడత నిధులు చేనేత కుటుంబాలకు అందించే కార్యక్రమం కోసం వెంకటగిరి వచ్చిన జగన్, సభలో ముందుగా బటన్ నొక్కి డబ్బులను వారి ఖాతాలలో జమ చేశారు. అంతకముందు రామ్‌కుమార్‌రెడ్డి తన స్వాగతోపన్యాసంలో ముఖ్యమంత్రిని వినూత్న రీతిలో స్వాగతిస్తూనే, నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైన కోరికలన్నీ ముఖ్యమంత్రి ముందుంచారు. ఎటు చూసినా జనం, ఎల్లలు లేని అభిమానంతో ఆనందభరితుడైన జగన్, రామ్‌కుమార్‌రెడ్డి అడిగిన అన్ని వరాలకి తథాస్తు అన్నారు.

## జనార్ధనరెడ్డి విగ్రహా ఆవిష్కరణ...

నేదురుమల్లి కుటుంబసభ్యుల సమక్షంలో వేలాదిమంది వారి కుటుంబ అభిమానుల హర్షద్వానాల నడుమ దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని సీఎం జగన్ ప్రారంభించారు. సభా కార్యక్రమం అనంతరం త్రిభువన్ సెంటర్‌కి చేరుకున్న ముఖ్యమంత్రి, జనార్ధనరెడ్డి విగ్రహ ఆవిష్కరణ గావించి అక్కడే ఉన్న నేదురుమల్లి కుటుంబసభ్యులందరినీ పలకరించారు. విగ్రహావిష్కరణ అనంతరం నేరుగా హెలిపాడ్ వద్దకు చేరుకొని రేణిగుంట ద్వారా తాడేపల్లికి వెళ్లిపోయారు.



## తగ్గని ఆకర్షణ.. తరగని ఆదరణ..!

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి బాగా పట్టున్న నెల్లూరుజిల్లాలో ముగ్గురు ఎం.ఎల్.ఏలు వెళ్ళిపోయినంత మాత్రాన ఏదో మునిగిపోయిందని భ్రమిస్తున్న వారికి వెంకటగిరి సభ ఒక సందేశమివ్వడమే కాకుండా, జనంలో జగన్‌పై ఆకర్షణ తగ్గలేదన్న సంకేతాన్ని కూడా ఇచ్చిందన్నది అక్కడ వినిపించిన జనవాక్కు.

## దిష్టి చుక్కలా... చిన్న అసంతృప్తి..!

వెంకటగిరి ప్రాంతంలో ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో జరిగిన నాటి కార్యక్రమంలో కీర్తిశేషులు జనార్ధనరెడ్డి గురించి జగన్ ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోయాడన్న నేదురుమల్లి కుటుంబ అభిమానుల అసంతృప్తి మొత్తం కార్యక్రమానికి దిష్టిచుక్కలా మారడం కొసమెరుపు.

# 'తంగిరాల మహాభారతం' 65వ భాగం




శ్రీకృష్ణ, భీమార్జునులు, స్నాతక వేషధారులై, చాలా నదులు, ప్రదేశాలు దాటి మగధ రాజధాని గిరివ్రజపురం చేరుకుంటారు. ఆ నగరాన్ని 5 పర్వతాలు పెట్టని కోటల్లాగా సంరక్షిస్తుంటాయి. చైత్యకగిరి మీద మూడు భీషణ భేరీలుంటాయి. శత్రువులెవరు ఆ నగరంలో ప్రవేశించలేరు. ఎందుకంటే ఆ భేరీలు భయంకర స్వరంతో ప్రతిధ్వనిస్తాయి. శ్రీకృష్ణ, భీమార్జునులు ఒక్కతృటిలో వాటిని పగలకొట్టి, ఆ శిఖరాన్ని తుత్తునీయలు చేసి ఆ నగరంలోకి ప్రవేశిస్తారు. గంధం, చందనం అమ్మేవాళ్ళ ఇళ్లల్లో చొరబడి బలాత్కారంగా ఆ వస్తువులు లాక్కుని అలంకరించుకుంటారు. జరాసంధుని అంతఃపురంలో బ్రాహ్మణులనెవ్వరు అడ్డగించరు, అందువల్ల వీళ్ళ ముగ్గురు అవలీలగా ప్రవేశిస్తారు. జరాసంధుడు వీళ్ళని చూసి అతిథి మర్యాదలు చేస్తే, వీళ్ళు దాన్ని తిరస్కరిస్తారు. జరాసంధుడు ఆశ్చర్యపోయి మీరెందుకు ఇలా భేరీలు, శిఖరాన్ని పగలగొట్టి, బలాత్కారంగా వస్తువులు లాక్కుని అంతఃపురంలోకి అపసవ్యంగా ప్రవేశించారు. మీ వేషాలు బ్రాహ్మణుల లాగవున్నాయి, కానీ చూడటానికి క్షత్రియుల్లాగా ఉన్నారు, ఎవరు మీరని అడిగినప్పుడు, శ్రీకృష్ణుడు జరాసంధుడు చేస్తున్న ఆగడాలన్నీ చెప్పి, తమ ముగ్గురి గురించి వివరించి, నీ కారాగారంలో బందీలుగా ఉన్న రాజులని తక్షణమే విడిపించకపోతే నీవంటి పాపాత్ముణ్ణి చంపటానికి వచ్చామని, నీ కర్తవ్యమేమిటో ఆలోచించుకొమ్మని వీరావేశంతో అంటాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అధికారులను అభినందించిన సిఎం





'నేతన్న నేస్తం' నిధులు లబ్దిదారుల ఖాతాల్లో జమచేసేందుకు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా ఇటీవల వెంకటగిరికి విచ్చేసిన వైయస్ జగన్మోహన్‌రెడ్డికి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి స్వాగతం పలికారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సీఎం సభా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి సూచనలను అనుసరిస్తూ డివిజన్‌లోని అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో సరదాగా మాట్లాడి, ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓలను అభినందించారు. అదే క్రమంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

## డిఎస్పీ సూర్యనారాయణ



దేశానికి విశేష సేవలు అందించిన అబ్దుల్ కలాం పేరుతో చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి వెల్లడించారు. గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అండర్ 15 చదరంగ పోటీలను డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించి, చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం జరిగిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవలను కొనియాడారు. విద్యార్థినీవిద్యార్థులు చిన్నతనం నుండి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు నిరంతరం కష్టపడాలని సూచించారు. రూరల్ సీఐ దశరథ రామారావు, ట్రస్ట్ నిర్వాహకులు తాజుద్దీన్, పార్వతయ్య, నరేంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి.



# తాళ్లమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు గ్రామదేవత తాళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేష అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని చెన్నూరు–తిప్ప వరప్పాడు గ్రామాల ఆరాధ్య దైవం కటాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు.

# రిలీవింగ్ విధులు రద్దు చేయాలి



అలిపిరి డిపో వద్ద రిలీవింగ్ డ్యూటీలను రద్దు చేయాలని ఎన్ఎంయూ నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఈ నెల 25వ తేదీ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో వరుసగా రెండవరోజూ నిరసన, ధర్నా కొనసాగించారు. గూడూరు నుంచి తిరుమలకు బస్సులను రద్దు చేసి, అలిపిరి వద్ద రిలీవింగ్ డ్యూటీలు వేయడంతో డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అలిపిరి వద్ద డ్యూటీలను రద్దు చేసి, గూడూరు నుంచి తిరుమలకు బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, శ్రీనివాసులు, అహ్మద్, ప్రవీణ్, కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

# గూడూరు రోడ్లను రక్షించండి





తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలో గ్యాస్ పైప్‌లైన్ కోసం అడ్డగోలు తవ్వకాలు చేస్తున్నారని, తవ్విన గుంటలను తూతూ మంత్రంగా పూడ్చి వదిలేస్తున్నారని గూడూరు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎడతెరిపిలేని వర్షాలతో గుంటలు నీళ్ళతో నిండిపోయి ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురౌతున్నామని, ఇటీవల ద్విచక్రవాహనంతో సహా ఇద్దరు వ్యక్తులు గుంతల్లో పడిపోయి ఎలాగో ప్రాణాలతో బయట పడ్డారంటూ పట్టణంలోని చిన్నచిన్న వీధుల్లో సైతం రోడ్లు పగలగొట్టి పెద్దపెద్ద గుంతలు తవ్విన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ నాసిరకంగా జరుగుతున్న ఈ పనులను పరీక్షించి, తగు చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రజలు వాపోతున్నారు.

# లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం




ఈ నెల 23వ తేదీ గూడూరులోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి పెన్షనర్ల భవనంలోని అయ్యల చంద్రమ్మ భాస్కరరావు ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడుగా ఆర్.రవిచంద్రారెడ్డి, సెక్రటరీగా కె.శివయ్య, ట్రెజరర్‌గా పి.వీరేంద్రనాథ్ మరియు కార్యవర్గ సభ్యులతో లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బయ్యా రవికుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. రీజియన్ ఛైర్మెన్ డి.వి శరత్‌బాబు, జోన్ ఛైర్మెన్ వై.గురునాథం, ఎస్ఎస్‌వి రామ్మోహన్‌రావు, డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్, మురళిరెడ్డి, వాకాటి రామ్మోహన్, రూపేష్‌రెడ్డి, చెంచురామయ్య, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పలసరుకులు



ఈ నెల 23వ తేదీ గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో బాలాజీ నగర్‌లోని ప్రగతి కార్యాలయంలో నిరుపేదలైన 15 కుటుంబాలకు 18 రకాల పలసరుకులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, వాకాటి రామ్మోహన్‌రావు, పి.డి కరిముల్లా, రాధయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జి.వి.ఆర్.ఆర్ కళాశాలలో 'కార్గిల్ విజయ్ దివాస్'



'మేరీ మట్టి.. మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా జులై 26వ తేదీ జి.వి.ఆర్.ఆర్ కాలేజీలో 'కార్గిల్ విజయ్ దివస్'ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ప్రత్యక్షంగా నాలుగు యుద్ధాలు జరిగితే, నాలుగు యుద్ధాలలో భారత్ విజయం సాధించిందని అన్నారు. దేశం బలంగా ఉంటేనే ప్రజలు ఆనందంగా ఉంటారని, దేశ రక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్న విశ్రాంత వింగ్ కమాండర్ వల్లూరు శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో తనకు ఎదురైన ప్రత్యక్ష అనుభవాలను విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. ఈ యుద్ధంలో సుమారు 537మంది ప్రాణాలు కోల్పోగా, వేలమంది గాయాల పాలయ్యారని గద్గద స్వరంతో అన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దోర్నాదుల వెంకటేశ్వర్లు, డాక్టర్ మగ్రి వెంకటరావు, డాక్టర్ బాలాజీ రవికుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.




# 'అపస్మా' సేవలు అభినందనీయం

## ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు నగరంలోని సిల్వర్ ఓక్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఈనెల 23న ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సిబిఎస్ఇ పాఠ్య ప్రణాళికపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ప్రైవేట్ టీచర్ల బోధన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అపస్మా ఈ శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టి మెరుగైన విద్యా విధానానికి పునాదులు వేస్తోందని, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. నూతన విద్యావిధానం విద్యార్థులకు ఎంతో మేలుచేస్తుందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల అభివృద్ధికి ఎమ్మెల్సీగా తన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తాము చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సహకారం మరువలేనిదని అపస్మా సీనియర్ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని, పలువురు ఉపాధ్యాయులను అపస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అపస్మా జిల్లా అధ్యక్షుడు నేలనూతల శ్రీధర్, రాష్ట్ర సలహాదారు శౌరిరెడ్డి, అపస్మా ప్రతినిధులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, సిహెచ్‌వి రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామయ్య, రామ్మోహన్‌రెడ్డి, రమేష్, అభిషేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోవూరులో పోలేరమ్మకు శ్రావణమాసం పూజలు

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కోవూరులోని శాంతినగర్‌లో కొలువైవున్న గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ఈనెల 23న పంచాయతి మేస్త్రీ తిరుపతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# న్యాయ పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకోవాలి

## - హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏవీ శేషసాయి



న్యాయవాదులు ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని మరింతగా పెంచుకోవాలని, న్యాయపరిజ్ఞానాన్ని ఇంకా బాగా పెంపొందించుకోవాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి సూచించారు. ఈనెల 22న ఆయన నెల్లూరు టౌన్‌హాలులో ఏర్పాటైన న్యాయవాదుల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయవ్యవస్థకు మేధోమథనం అవసరమని, ఇలాంటి సదస్సులు అందుకు ఎంతో ఉపయోగమని, ముఖ్యంగా న్యాయవాదులు మరింత ఉన్నత దశకు చేరుకునేందుకు ఇవి దోహదం చేస్తాయని చెప్పారు. న్యాయపరిజ్ఞానం ఎంత బాగా ఉంటే అంతగా సమాజానికి సేవలందించవచ్చన్నారు. న్యాయవాదులు ఇలాంటి సదస్సుల ద్వారా వృత్తిపరంగా ఎదుగుదల పొందగలుగుతారని ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. అనంతరం పలు అంశాలపై న్యాయవాదుల సందేహాలను న్యాయమూర్తులు నివృత్తి చేశారు. జిల్లా జడ్జి యామిని, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఏ.రామిరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మెన్ గంటా రామారావు, బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, జిల్లాలోని అనేకమంది న్యాయవాదులు, నెల్లూరు న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మెదడు సరిగా లేకుంటే మానసికంగా, శారీరకంగా కూడా అవస్థలు తప్పవని నెల్లూరులోని నారాయణ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్ఎస్ సంపత్‌కుమార్ చెప్పారు. ఈనెల 22న ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా నగరంలోని చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూర్ఛ, మైగ్రేన్ తలనొప్పి, మానసిక కుంగుబాటు, మతిమరుపు, పక్షవాతం వంటి మెదడు రుగ్మతల గురించి ఆయన ఆసుపత్రి సిబ్బందికి, రోగులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కలిగించారు. తగినంత నిద్ర, సానుకూల దృక్పథం అలవరుచుకోవడంతో పాటు, జీవనశైలిని ఆరోగ్యంగా ఉంచుకోవడం అన్నివేళలా శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ పాలకమండళ్ళలో గిరిజనులకు చోటివ్వాలి

రాష్ట్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలోను, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పెంచలకోన, అహోబిలం, సింహాచలం వంటి ప్రముఖ ఆలయాల్లోను పాలకమండలిలో గిరిజనులకు కూడా చోటివ్వాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు కోరారు. ఆ మేరకు తాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశానన్నారు. గిరిజనుల సమస్యలపై ముఖ్యమంత్రికి రోజుకో లేఖ రాసే ఉద్యమాన్ని తాము చేపట్టామన్నారు. తమ లేఖలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కామాక్షితాయికి కాసుల పేరు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వెలసివున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి ఈనెల 22న మనుబోలుకు చెందిన చెన్నూరు నరేష్‌రెడ్డి-శ్రీలక్ష్మి దంపతులు 115 గ్రాముల 330 మిల్లీగ్రాముల బంగారు కాసులపేరు హారాన్ని సమర్పించుకున్నారు. ఆ హారాన్ని ఆలయ పాలకమండలి ఛైర్మెన్‌కు అందజేశారు. ఆలయ ఇఓ, పాలకమండలి సభ్యులు, ఉభయకర్తలతో స్వామివారికి, అమ్మవారికి పూజలు చేయించగా, అర్చకులు వారిని ఆశీర్వదించారు.

## విఆర్ఓల సంఘానికి కొత్త కార్యవర్గం

జిల్లాలోని గ్రామ రెవెన్యూ అధికారుల (విఆర్ఓ) సంఘానికి ఈనెల 22న కొత్త కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షునిగా ఆరికట్ల సురేంద్రనాయుడు ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా ఎం. హజరత్తయ్య, ఉపాధ్యక్షులుగా వి.సురేష్, తిరుమలరావు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దారా వెంకటరమణయ్య, కోశాధికారిగా బి.పెంచలరావుతో పాటు మరో 17 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర విఆర్ఓల సంఘం నేతలు ఆంజనేయకుమార్, అనుపమల ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఏపీ రెవెన్యూ సర్వీసెస్ కార్యాలయంలో ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లాలో విఆర్ఓల సమస్యల సాధనకు కృషిచేస్తామని ఈ సందర్భంగా కొత్త కార్యవర్గ నాయకులు చెప్పారు. అనంతరం డిఆర్ఓ వెంకటనారాయణమ్మను మర్యాదపూర్వకంగా కలిసి కొత్త కమిటీని పరిచయం చేసుకున్నారు.

## ఎస్పీబీ ప్రభుత్వ సంగీత పాఠశాలలో అడ్మిషన్లు

నెల్లూరులోని పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. గాత్రం, వయొలిన్, భరతనాట్యం, మృదంగం, డోలు కోర్సులకు సంబంధించి ఆసక్తి కలవారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, 50 రూపాయలు చెల్లించి పాఠశాలలో దరఖాస్తులు పొందాలని, విద్యార్థులు, గృహిణులు ఉద్యోగులకు అనువైన సమయాల్లో పాఠశాలలో శిక్షణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. వివరాలకు 0861 2328285, లేదా 9000786599 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## టూకీగా...



### సాయిపేటలో 350 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కొండాపురం మండలంలోని సాయిపేట గ్రామంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఈనెల 21న దాడులు జరిపి, శ్రీ లక్ష్మీనరసింహ రైసుమిల్లులో అక్రమంగా నిల్వచేసి ఉన్న 350 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మిల్లు యజమానిపై 6-ఏ కేసు పెట్టామని పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

### విడవలూరులో సచివాలయం తనిఖీ

జడ్పీ సిఇఓ చిరంజీవి ఈనెల 22న విడవలూరులోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. జగనన్న సురక్ష, అమ్మఒడి, పింఛన్లు తదితర ప్రభుత్వ పథకాలను సచివాలయ సిబ్బంది ఏవిధంగా అమలుచేస్తున్నారో పరిశీలించి, తగు సూచనలిచ్చారు. కార్యదర్శి ఉదయ్, విఆర్ఓ వెంకటేశ్వర్లు, మహిళా కానిస్టేబుల్ రమ, ఆనంద్‌రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### నందలగుంటలో జగనన్న ఇళ్ళ నిర్మాణాల పరిశీలన

కోవూరు మండలంలోని నందలగుంటలో జరుగుతున్న జగనన్న గృహనిర్మాణాలను ఈనెల 22న గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి లబ్ధిదారునికి సిమెంట్, స్టీలు, ఇసుక అందజేయాలన్నారు. హౌసింగ్ డిఇ దయాకర్, ఏఇ మాధవయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

### కొడవలూరులో అనాథాశ్రమం పిల్లలకు అన్నదానం

కోవూరు మాజీ ఏఎంసి ఛైర్మెన్ పూండ్ల అచ్యుత్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఈనెల 22న కొడవలూరులోని విశ్వనిలయం అనాథాశ్రమంలో చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. వైకాపా నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పెంచలకోనలో నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో కొలువైవున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం ఈనెల 22న అత్యంత వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు శ్రీవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, చందనాలంకారం చేసి అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు.

### పాటూరులో భూసర్వే పనులపై సమీక్ష

కోవూరు మండలంలోని పాటూరులో 'జగనన్న భూహక్కు - భూ సర్వే'పై సంబంధిత అధికారులు, సిబ్బందితో కోవూరు తహశీల్దార్ ఎం.పద్మజ ఈనెల 22న సమీక్ష నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారి రమణమ్మ, సర్వేయర్లు పాల్గొన్నారు.

### నెల్లూరులో పురిటి బిడ్డలకు ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు జనార్దన్‌రెడ్డి కాలనీలోని సాయినాథ్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఈనెల 23న పురిటి బిడ్డలకు, పసిపిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీవత్స చెస్ట్, చిల్డ్రన్స్ ఆసుపత్రి సహకారంతో వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఆసుపత్రి వైద్యులు కె.చిరంజీవి, కల్యాణితో పాటు డాక్టర్లు శ్రీనివాస్, ఆయేషా, ప్రసాద్ పాల్గొన్నారు.




కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి ఆశాజ్యోతి, నిరంతరం మా హృదయాంతరాల్లో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2023 మంగళవారం ఆ మహనీయుని 46వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారుడు
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎం.పి

మనుమళ్ళు
మాగుంట విజయ్‌రెడ్డి
మాగుంట కిరణ్‌రెడ్డి

# అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం!

(మొదటి పేజీ తరువాయి)

ఫ్రిజ్‌లు గ్రైండర్‌లు, ఏసీలు కూడా ప్రజలకి ఉచితంగా పంచిపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో 1982లో పార్టీ పెట్టిన ఎన్టీఆర్... ఆయన అధికారంలోకి రాగానే రెండు రూపాయలకి కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ పథకం రామారావుకి చాలా పేరు తెచ్చిపెట్టింది. రామారావు తరువాత మళ్ళీ 2004లో కాంగ్రెస్ వచ్చేవరకు అంతకు మించిన పథకమేమీ ఆ పార్టీ తేలేకపోయింది. మధ్యలో 1989-94 మధ్య కాలంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, రామారావు ప్రారంభించిన రెండురూపాయల కిలో బియ్యం పథకాన్నే కొనసాగించింది తప్ప కొత్తగా వరాలేమీ ప్రకటించలేకపోయింది.

2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా తన తొలి సంతకాన్ని రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై పెట్టారు. ఆ తరువాత ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి ప్రజోపయోగ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు భారీ స్థాయిలో నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి ప్రధాన అంశాలకి ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధే ప్రధాన అజెండాగా శ్రీసిటీ లాంటి పారిశ్రామికవాడలను ప్రోత్సహించారు. రాష్ట్రంలో సుదీర్ఘంగా ఉన్న తీర ప్రాంతాన్ని ఎగుమతులు, దిగుమతులకు వేదికగా మార్చాలన్న లక్ష్యంతో కృష్ణపట్నం పోర్టు వంటి ఓడరేవులకు తమ సహకారాన్ని అందించారు. ముందుచూపుతో ఆయన చేసిన ఆలోచన కొన్ని లక్షల కుటుంబాలకి ఇప్పుడు జీవనాధారంగా మారింది. ఆయా కుటుంబాల వారందరికీ ఆయన దైవంగా మారారు. ప్రతి ఇంటిలో పూజగది గోడపైకి ఆయన ఫోటో చేరింది.

## నోట్ల రాజకీయంగా మారిన ఓట్ల రాజకీయం...!

ప్రస్తుత తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే... తెలంగాణ రాష్ట్రంలో తెరాస పార్టీ కూడా ఉచితాలకి పోటీపడుతోంది. రైతు బంధు, దళితబంధుల వంటి పథకాలతో పాటు అనేక ఉచిత తాయిలాల బాట పట్టింది. గత ఎన్నికలలో చివరిదశలో పసుపు - కుంకుమ పేరుతో చంద్రబాబు మహిళల ఖాతాలలో 10వేల రూపాయలు జమచేసి ప్రభుత్వ డబ్బుతో ఓట్లు కొనుక్కునే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీకి ఆ ఆలోచన బాగా ఉపయోగపడుతోంది. దేశంలోని ఇతర పార్టీల ఉచిత పథకాలతో పోలిస్తే ఆంధ్రాలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మొదటి స్థానం సంపాదిస్తోంది. ఓట్ల రాజకీయాన్ని పూర్తిగా నోట్ల రాజకీయంగా మార్చడంలో వైసీపీ ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా నిలిచిందన్నది విశ్లేషకుల అభిప్రాయం. గత ప్రభుత్వాలు పథకాల పేరుతో రాయితీలు, పరోక్ష ప్రయోజనాలు కల్పిస్తే... జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క బటన్ నొక్కి అధికారికంగా నేరుగా ప్రజల అకౌంట్లలో ప్రభుత్వ సొమ్ము జమ చేసేస్తోంది.

జగన్ ప్రభుత్వం అందిస్తున్న ధన పంపక పథకాలలో మచ్చుకి కొన్నిటిని గమనిస్తే...

### జగనన్న అమ్మ ఒడి

కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా కుటుంబంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పిల్లల చదువుల కోసం ప్రతి తల్లి లేదా గుర్తింపు పొందిన ఇంటి పెద్దకి ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. విద్య ప్రారంభదశ నుండి 12వ తరగతి వరకు ఇంట్లో ఉన్న పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికి ఏడాదికి 15,000 రూపాయలు లెక్కన నేరుగా తల్లులు, లేదా అర్హత పొందిన ఇంటిపెద్ద ఖాతాలో జమ చేస్తారు.

### జగనన్న చేదోడు

రాష్ట్రంలోని దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణుల కోసం మాత్రమే రూపొందించిన పథకం 'జగనన్న చేదోడు'. ఈ పథకం కింద లబ్ధిదారులకు రూ.10,000/- ఒకేసారి అందిస్తారు.

### జగనన్న తోడు

ఎక్కువ వడ్డీలతో సతమతమవుతున్న చిన్న వ్యాపారుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం జగన్నన్న తోడు. సాంప్రదాయ హస్తకళల్లో నిమగ్నమైన హాకర్లు, వీధి వ్యాపారులు, చేతివృత్తుల వారికి సంవత్సరానికి 10,000 రూపాయల వడ్డీ రహిత టర్మ్‌లోన్ బ్యాంకుల ద్వారా అందిస్తారు. ఈ మొత్తానికి వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుంది.

### జగనన్న వసతి దీవెన

జగనన్న వసతి దీవెన కింద విద్యార్థుల హాస్టల్, మెస్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కోర్సుల(ఐటీఐ) విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.10,000, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15,000, డిగ్రీ విద్యార్థులకు రూ.20,000 ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తారు. కోర్సులతో సంబంధం లేకుండా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తారు.

### జగనన్న విద్యా దీవెన

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజులు చెల్లించలేని విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్‌లు అందించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ పథకం కింద, రాష్ట్రంలోని దాదాపు 14 లక్షల మంది విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు అందిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఏటా నాలుగు విడతలుగా నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేస్తున్నారు.

### వైఎస్ఆర్ చేయూత

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనారిటీ కులాల మహిళల కోసం వైఎస్సార్ చేయూత అమలు చేస్తున్నారు. 45 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న మహిళలకు నాలుగేళ్ల వ్యవధిలో ఒక్కొక్క కుటుంబానికి రూ. 75,000 అందించాలన్నది లక్ష్యం.

### వైఎస్ఆర్ కాపు నేస్తం

కాపు, బలిజ, తెలగ కులాలతో పాటు ఇతర ఉపకులాల ఒంటరి మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం అంటూ సంవత్సరానికి రూ.15,000/- చొప్పున రూ.75,000/- వారి ఖాతాల్లో జమ చేస్తారు.

### వైఎస్ఆర్ లా నేస్తం

జూనియర్ లాయర్లకు స్టైఫండ్‌గా నెలకు రూ.5,000/- ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం డిసెంబర్ 2019లో 'వైఎస్ఆర్ లా నేస్తం'ను ప్రవేశపెట్టింది. జూనియర్ అడ్వకేట్లు, లాయర్లందరికీ మొదటి మూడు సంవత్సరాల ప్రాక్టీస్ సమయంలో స్టైఫండ్‌గా నెలకు రూ. 5,000/- అందిస్తారు

### వైఎస్ఆర్ మత్స్యకార నేస్తం

ఆంధ్ర రాష్ట్రంలో మత్స్యకారులకు ఆర్థిక సహాయంగా "నో ఫిషింగ్" వ్యవధిలో మెకనైజ్డ్, మోటరైజ్డ్, ఫిషింగ్ బోట్లు, నెట్‌లు, వేట తెప్పలను నిర్వహిస్తున్న మత్స్యకారులకు ఏడాదికి రూ. 10,000/- అందిస్తుంది. దీంతోపాటు వీరికి సబ్సిడైజ్డ్ డీజిల్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

### వైఎస్ఆర్ నేతన్న నేస్తం

చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి నేత పనులను మెరుగుపరచడం కోసం అంటూ ఈ పథకం ద్వారా ప్రతి ఏటా సొంతంగా మగ్గాలు ఉన్న నేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.24వేలు నేరుగా జమ చేస్తారు. ప్రతి లబ్ధిదారుడికి ఐదేళ్లలో మొత్తం రూ.1.2 లక్షల సాయం అందుతుంది. తుది విడత ఇటీవలే వెంకటగిరి నుండి జమచేశారు ముఖ్యమంత్రి జగన్.

### వైఎస్ఆర్ పెన్షన్ కానుక

బడుగు, బలహీన వర్గాల వారు ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, వారి కష్టాలను తీర్చడానికి, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులకు రూ. 2,750/- నెలవారీ పెన్షన్ అందిస్తున్నారు. చెప్పులు కుట్టేవారు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లు, డప్పు కళాకారులు కూడా నెల వారీ పెన్షన్ రూ.3,000/- అందుకుంటున్నారు.

### వైఎస్ఆర్ రైతు భరోసా

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కౌలు రైతులతో సహా ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.13,500/- చొప్పున ఆర్థిక సహాయం అందించడం కోసం ఆంధ్ర ప్రభుత్వం "వైఎస్ఆర్ రైతు భరోసా" అమలుచేస్తోంది.

### వైఎస్ఆర్ వాహనమిత్ర

ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లు/ఓనర్లకు ఏటా రూ.10,000/- ఆర్థిక సాయం 'వైఎస్ఆర్ వాహనమిత్ర' పథకం కింద అందిస్తోంది ఏపీ ప్రభుత్వం. వాహన నిర్వహణ, బీమా మరియు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను పొందడం కోసం ఈ సాయం అందిస్తున్నామని చెప్తోంది.

ఇలా చెప్పినవి, చెప్పనివి చేస్తూ ప్రజల ఖాతాలలో డబ్బులేసుకుంటూ వెళ్తున్నారు ఆంధ్ర సీఎం. ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ఉత్పత్తి పెంపుతో సంపద సృష్టికి బీజం వేయాల్సిన ప్రభుత్వం... అప్పులు తెచ్చి, ఆ డబ్బుని జనాకర్షక పథకాలతో వ్యక్తిగత, పార్టీగత పరపతిని పెంచుకునేందుకు ధారపోస్తోంది. విభజన చట్టం ప్రకారం వివిధ ప్రాజెక్టుల కింద దాదాపు రూ.75,000 కోట్లు గ్రాంటురూపంలో రాష్ట్రానికి రావాలి. కానీ, 9 ఏళ్లు గడుస్తున్నా వచ్చింది మాత్రం రూ.21,000 కోట్లే. ఏపీ అప్పు మాత్రం రూ.10లక్షల కోట్లు దాటింది. ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు ఏడున్నర లక్షల కోట్లుగా లెక్కలు చెప్తున్నాయి.

### అప్పులన్నీ స్వలాభానికే...

రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వచ్చే రెవెన్యూ ఆదాయంతోనే ఖర్చులన్నీ చూసుకోవాలి. వస్తున్న ఆదాయం ఖర్చులకు సరిపోని పక్షంలో ప్రతి నెలా కేంద్రం రెవెన్యూ లోటు గ్రాంటును రాష్ట్రాలకు ఇస్తుంది. అలా, ఏపీకి ఈ నాలుగేళ్లలో రూ.29,000 కోట్లు వచ్చాయి. ఖజానాకు వచ్చే రెవెన్యూ ఆదాయం, కేంద్రం ఇచ్చే లోటు గ్రాంటుతో రెవెన్యూ ఖర్చులన్నీ చక్కబెట్టుకోవాలి. అంటే తెచ్చిన అప్పులన్నింటినీ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చుపెట్టాలి. అందుకే ప్రభుత్వ భాషలో వాటిని అప్పులు అని పిలవకుండా 'క్యాపిటల్ రిసీట్స్' అని పిలుస్తారు.

కానీ, ఏపీలో మాత్రం రివర్స్. ఈ నాలుగేళ్లలో క్యాపిటల్ రిసీట్ ఏడున్నర లక్షల కోట్లున్నా, రాష్ట్రానికి సమకూరిన ఆస్తి ఒక్కటీ లేదు. పైగా రాష్ట్ర భూములు, ప్రభుత్వ భవనాలు, పోర్టు భూములు అన్నింటినీ జగన్ ప్రభుత్వం తాకట్టు పెట్టింది. ఆఖరికి ఉద్యోగుల జీపీఎఫ్ సొమ్మును చూపించి కూడా అప్పులు తెస్తోంది. ఈ అప్పుల్లో ఒక్క లక్షకోట్లను సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఉపయోగించి ఉంటే అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవి. ఉపాధి అవకాశాలు పెరిగేవి. ఈ నాలుగేళ్లలో ఉద్యోగాలు వచ్చే ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదంటే అతిశయోక్తి కాదు.

### సర్పంచ్‌ల నుంచి ఉద్యోగుల వరకూ అందరూ బాధితులే..

పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను విద్యుత్ బకాయిల కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జమ చేసుకోవడం ఈ నాలుగేళ్లలో ఆనవాయితీగా మారింది. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు చిల్లిగవ్వ లేకుండా పోతోందని సర్పంచులు గగ్గోలుపెడుతున్నారు.

రోడ్ల మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటివరకూ చేసిన పనులకు ముందు బిల్లులివ్వమని డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేలా రాష్ట్రానికి ఆదేశాలివ్వమంటూ కాంట్రాక్టర్లు హైకోర్టులో పిటిషన్లు వేశారు. పిటిషన్లు వేయని అనేకమంది కాంట్రాక్టర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వాసుపత్రులకు మందులు, వైద్య పరికరాలు సరఫరా చేసే కంపెనీలు రెడ్ నోటీస్ పంపాయి. బిల్లులిస్తేనే ఇకపై సరఫరా చేస్తామని స్పష్టం చేస్తున్నాయి.

వేతన సవరణ బకాయిలు, డీఏ బకాయిలు, హెల్త్‌కార్డులు ఎందుకు ఇవ్వరంటూ ఉద్యోగులు మండిపడుతున్నారు. అన్నిటికీ మించి ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లివ్వమని ఉద్యోగులు డిమాండ్ చేసే దుస్థితికి వచ్చింది రాష్ట్రం.

తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం పూర్తిచేసింది. దేశ, విదేశీ కంపెనీల నుంచి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి. తెలంగాణకి కొత్త సచివాలయం కట్టుకున్నారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు అనేకం ఉన్నాయి. ఏపీ నుంచి ఉన్న కంపెనీలు పోవడం తప్ప కొత్తగా ఒక్క కంపెనీ కూడా రాలేదు. తమిళనాడు పారిశ్రామిక ప్రగతిలో దూసుకుపోతోంది. కానీ, ఏపీ కనీసం పోటీలో కూడా లేదు. పొరుగు రాష్ట్రాలకు ఏపీ కంటే ఎక్కువ అప్పులుండొచ్చు. కానీ, ఆ రాష్ట్ర పాలకులు అదే స్థాయిలో ఆదాయమార్గాలు సమకూర్చుకుంటున్నారు. కానీ, ఏపీలో అప్పులు కట్టడం కోసం కూడా అప్పులు చేస్తున్నారు. మంగళవారం పార్లమెంటు కేంద్రమంత్రి షెకావత్ కూడా ఏపీని చూసి జాలేస్తుందని, కేంద్రం నిధులిస్తున్నా వాడుకోవడం చేతకావడం లేదని ఆయన ప్రకటించారు. అందుకే రాష్ట్రం వైపు దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోంది. తెలంగాణ మంత్రులకైతే ఏపీ అంటే నవ్వులాటైపోయింది. సొంత రాష్ట్రాన్ని, జన జీవితాల్ని తలకిందులు చేస్తూ అప్పుడప్పుడూ బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లో ఒక పదివేల రూపాయలు వేస్తూ ఓటు బ్యాంకును భద్రం చేసుకుంటోంది వైసీపీ.

అదుపుతప్పి అల్లరిచేసే పిల్లల్ని దండించే ఉపాధ్యాయుడి తరహాలో ఆర్థిక పద్ధతులతో అదుపుతప్పిన రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నియంత్రించవచ్చు. ఆర్థిక క్రమశిక్షణ పాటించని రాష్ట్రాలను అదుపు చేయాల్సిన కేంద్రం, తన రాజకీయ అవసరాల కోసం తన బాధ్యతను విస్మరించి ఎడాపెడా అప్పులు తెచ్చుకోవడాన్ని చూస్తూ కాలక్షేపం చేస్తోంది. భవిష్యత్తులో రాష్ట్రం ఆర్థికమాంద్యంలో కూరుకుపోతే నష్టపోయేది ప్రజలు. అలా జరిగితే ఆ పాపంలో కేంద్రం కూడా పాలుపంచుకున్నట్లే అవుతుంది.

పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆంధ్రాకి రాబోయేకాలం గడ్డు కాలమే అని, రేపు ఎన్నికలలో ఎవరు గెలుస్తారన్నది ముఖ్యం కాదని, ప్రస్తుత ఆర్థికపరిస్థితిని ఎవరు చక్కబెట్టి గాడిన పడేస్తారన్నదే ప్రధానమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పక్క రాష్ట్రాల విషయంలో అప్పులతో కాకుండా అభివృద్ధితో పోల్చుకుని పనిచేయాలని, ఇకనైనా పాలకులు కళ్లు తెరచి, అప్పుల యోచన మాని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టి, విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, సంస్థలు, గ్రాంట్ల కోసం పార్లమెంటులో పోరాటం చేయాలన్నది మేధావుల సూచన.

---

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ

## ఎగ్జిబిషన్ వేదిక - తేదీలు మార్పు

భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్) క్షేత్ర కార్యాలయం, నెల్లూరు వారి ఆధ్వర్యంలో జులై 29, 30, 31 తేదీల్లో బారాషాహీద్ దర్గా ప్రాంగణంలో జరగాల్సిన భారత ప్రభుత్వ పథకాల ఎగ్జిబిషన్ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా వేయబడిందని క్షేత్ర ప్రచార అధికారి, పరవస్తు నాగసాయి సూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆగస్టు 1, 2 తేదీల్లో నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని మినీహాల్‌లో జరుగుతుందన్నారు. అంతే కాకుండా జులై 29, 30తేదీల్లో ఎగ్జిబిషన్ మినహా, అవగాహన కార్యక్రమాలను దర్గా ప్రాంగణంలోనే కొనసాగించటం జరుగుతుందని సూరి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# శ్రీసిటీలో 'కెర్రీ ఇండేవ్' లాజిస్టిక్స్ కేంద్రం



శ్రీసిటీలో దాదాపు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మన దేశంలోని ప్రముఖ ఇంటిగ్రేటెడ్ థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ సేవల సంస్థ 'కెర్రీ లాజిస్టిక్స్ నెట్‌వర్క్' నిర్మించిన నూతన అత్యాధునిక లాజిస్టిక్స్ కేంద్రాన్ని ఈనెల 21న ప్రారంభించింది. ప్రత్యేకంగా మిత్సుబిషి ఎలక్ట్రిక్ ఇండియా ఆపరేషన్స్ (ఏసీల వ్యాపారం) కోసం ఇది పనిచేయనుంది. పరిశ్రమ ఆవరణలో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలలో మిత్సుబిషి ఎలక్ట్రిక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) మసకాజు ఒబాటా నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కెర్రీ ఇండేవ్ ఛైర్మన్ డాక్టర్ జేవియర్ బ్రిట్టో కెర్రీ ఇండెవ్ సంస్థ పుట్టుక, ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ, సంస్థ ఎదుగుదలకు మద్దతిచ్చిన సహచరులు, ఖాతాదారులందరికీ ధన్యవాదాలు తెలిపారు. వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ వ్యాపార సంస్థలకు శ్రీసిటీ అత్యంత అనువైన స్థానంగా పేర్కొన్న ఆయన, తమ ప్లాంట్ ఏర్పాటుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన శ్రీసిటీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కెర్రీ లాజిస్టిక్స్, మిత్సుబిషి ఎలక్ట్రిక్ బృందాలను అభినందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో లాజిస్టిక్స్ మరియు వేర్‌హౌసింగ్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. మిత్సుబిషి ఎలక్ట్రిక్ ప్లానింగ్ హెడ్ ఎస్.గణపతి శంకర్, ఇండోస్పేస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్‌కళ్యాణ్, కెర్రీ సౌత్ ఈస్ట్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ అలెన్ ఇప్, కెర్రీ ఇందేవ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి.మణికంఠన్ తదితరులు పాల్గొన్నారు.



# 'మణి'పూర్! 'నేత'ల తీరు... మరీ 'పూర్'!

మణిపూర్ ఎక్కడ ఉంది? భౌగోళికంగా ఆ రాష్ట్రానికి ఉన్న ప్రాముఖ్యత ఏమిటి? జనాభా ఎంత? అక్కడ జాతులు, తెగల మధ్య నెలకొని ఉన్న సమస్య ఏమిటి? ఎందుకు వచ్చింది? ఎంత కాలంగా ఈ సమస్యతో మణిపూర్ అతలాకుతలం అయిపోతోంది? అది పరిష్కరించలేనిదా? ఎందువల్ల? అది సామాజిక సమస్యా..? లేక, శాంతి భద్రతల సమస్యా?

ఇప్పటివరకు మణిపూర్ హింసలో ఎంతమంది హత్యలకు, మానభంగాలకు గురయ్యారు? ఎంతమంది ఉపాధి కోల్పోయారు? ఎన్ని జీవితాలు, కుటుంబాలు శిధిలమయ్యాయి? మణిపూర్‌లో నిరంతరాయంగా, క్రమం తప్పకుండా నిత్యం చోటు చేసుకుంటున్న ఈ అమానవీయ ఘటనలకు ఎవరు బాధ్యులు?... ఈ ఘటనల ప్రభావం ఈశాన్యరాష్ట్రాలపై ఎలా ఉంది? అక్కడ ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అధినేతలు ఏం చేస్తున్నారు? మణిపూర్ సమస్యను పరిష్కరించడానికి అక్కడి ప్రభుత్వ సారథులు... చేయవలసినంత చేస్తున్నారా? లేక, అక్కడి సమస్యను పరిష్కరించడానికి అవసరమైన విజ్ఞత, దూరదృష్టి, అధికారాలు అక్కడి ప్రభుత్వ సారథులకు లేవా? ఒకవేళ, అక్కడి ప్రభుత్వ అధికారాలను చెలాయిస్తున్న వారికి ఆ 'ఇంగిత జ్ఞానం' లేకపోతే, కేంద్రం అయినా జోక్యం చేసుకోవాలి కదా?

ఇలాంటి సవాలక్ష ప్రశ్నలు ఏవీ మన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనసులో మెదలడం లేదు అని ఘంటాపథంగా చెప్పవచ్చు. కావాలంటే, బాండ్ పేపర్ మీద రాసి ఇవ్వొచ్చు.

ఈ భావనకు సజీవ తార్కాణం... ఆయన ప్రతినెలా దేశ ప్రజలతో పంచుకునే 'మన్ కీ బాత్'.

అదే... ఆయన 'మనసులోని మాట'.

ఈ 'మనసులోని' మాటను దేశ ప్రజలకు చేరవేయడానికి దేశంలోని రేడియో స్టాటియిన్‌లు, టీవీ ఛానెళ్లు, ఓ ఐదు వందలకు తక్కువ లేకుండా పెద్ద పెద్ద స్క్రీన్‌లు రంగంలోకి దిగుతాయి. ప్రధాని 'మన్ కీ బాత్'(మనసులోని మాట) ప్రసారానికీ వందల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ డబ్బు ఆయనది కాదుకదా! 'అది మనది కాకపోతే, ఎంత దూరమైనా దేకమని' ఊరికే అనలేదు మన పెద్దలు.

ఆయన మనసులోని మాటల్లో మణిపూర్ ప్రస్తావనే లేదు. 90 రోజులకు పైబడి ఆ గిరిజన రాష్ట్రం నిలువునా తగలబడిపోతుంటే... ప్రధాని మనసు నుంచి గానీ, నోటి నుంచి గానీ స్పందనే లేదు. అక్కడ స్త్రీ మూర్తులను వివస్త్రలను చేసి... నడిబజార్లలో నడిపిస్తుంటే, దేశ ప్రధాని మౌనవ్రతం వీడడం లేదు.

మణిపూర్ వెళ్ళాల్సిన హోంమంత్రి అమిత్ షా, ఆ పని వదిలేసి హైదరాబాద్ వస్తున్నారు.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఎలా ఓడించాలా అని ఇక్కడ ఉన్న వారితో చర్చించడానికి.

మణిపూర్ విధ్వంసంపై 'మౌన స్వామీ'జీతో మాట్లాడింప చేయడానికి పార్లమెంటులోని ప్రతిపక్షాలు అన్నీ కలిసి విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. 'మౌన ముని' నోరు విప్పడం లేదు. పెద్ద సారుతో నోరు విప్పించడానికి ఇం.. డి.. యా... కూటమి నేత మల్లిఖార్జున ఖర్గే నేతృత్వంలో లోక్‌సభలోని ప్రతిపక్షాలు కిందకి తల, పైకి కాళ్ళు పెట్టి... తపస్సు చేస్తున్నాయి.

ఊహు! సారు నోరు మెదపడం లేదు. ఫెవికాల్‌తో గానీ పెదాలు రెండూ అంటించేసుకున్నారా అని ప్రతిపక్షాలు ఆశ్చర్యపోతున్నాయి. పైపెచ్చు ప్రభుత్వ పెద్దలకు బోలెడంత గడుసుదనం!!.

'మణిపూర్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అంటూ స్పీకర్ ఓమ్ బిర్లా ప్రకటన. 'కమాన్ రండి... చర్చిద్దాం' అంటూ అమిత్ షా ప్రకటన. 'చర్చిద్దామంటే రారేం?!' అంటూ అమిత్ షా ఎద్దేవా. 'వాస్తవాలు ఏమిటో దేశ ప్రజలకు తెలియాలి...' అంటూ జోకులు. 'లోక్‌సభలో ప్రకటన చేయడానికి హోంమంత్రి సిద్ధంగా ఉన్నారు' అంటూ బీజేపీ నాయకుల ముక్తాయింపులతో బీజేపీ నేతలు కాలక్షేపం చేస్తున్నారు.

అంటే... ప్రధానమంత్రి పదవిలో ఉన్న మోడీ మాట్లాడరు అని అర్థం.

ఎందుకు మాట్లాడరు అనే ప్రశ్నకు... 'గోధ్రా ఫార్ములా' అని సూత్రీకరించుకోవచ్చు అని కొందరు విశ్లేషకులు అంటున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న బాబ్రీ మసీదును 'విజయవంతం'గా కూల్చివేసి, విజయగర్వంతో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో తిరిగివస్తున్న కరసేవక్‌లు ప్రయాణిస్తున్న బోగీని 2002, ఫిబ్రవరి 27న గోధ్రా రైల్వేస్టేషన్‌లో కొందరు దహనం చేశారు. ఈ ఘటనలో 59 మంది వరకు కరసేవకులు చనిపోయారు.

దానికి ప్రతీకారంగా జరిగిన అల్లర్లు, హత్యలు, మానభంగాలు, గృహ దహనాలు, దోపిడీల్లో దాదాపు వేయిమంది ముస్లింలు అసువులు కోల్పోయారు. ఈ ముస్లిం ఊచకోత తీరుకు ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజం నిశ్చేష్టురాలైపోయింది.

అయితేనేం? గుజరాత్ పౌర సమాజం హిందువులు, హిందూయేతరులుగా నిట్టనిలువుగా చీలిపోయింది. ఇక, అప్పటినుంచి గుజరాత్‌లో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి బీజేపీయే నాయకత్వం వహిస్తోంది. ఈ ఘటనతో... బీజేపీకి మోడీ, మోడీకి బీజేపీ పర్యాయ పదాలైపోయాయి.

మోడీ గుజరాత్ నుంచి ఢిల్లీకి రావడంతో, 'గుజరాత్ ఫార్ములా'ను దేశమంతా అమలులోకి తీసుకువచ్చే పనిలో బీజేపీ పడిపోయిందనే అనుమానాలు దేశంలో బలంగానే నాటుకున్నాయి.

ఇప్పుడు, మణిపూర్ మంటల్లో కాలి బూడిద అయిపోవడానికి కూడా రెండు జాతుల మధ్య అనాదిగా వస్తున్న 'జాతి వైరమే' కారణం.






మణిపూర్‌లో 'మణి' అంటే.. మనం అనుకునే నవరత్నాలలో ఒక రత్నం అన్నమాట.

కెంపు, వజ్రం, నీలం, పుష్య రాగం, మరకతం, ముత్యం, పగడం, గోమేదికం, వైడూర్యం.. వీటిని నవరత్నాలు అంటాం కదా! 'మణి' అంటే వీటిల్లో ఒకటి అన్న మాట. పూర్ అంటే ప్రాంతం.

భౌగోళికంగా దేశానికి ఈశాన్య ప్రాంతంలో ఉండడం వల్ల మిజోరం, నాగాలాండ్, మణిపూర్, అస్సాం మొదలైన రాష్ట్రాలను 'ఈశాన్య ' రాష్ట్రాలు అంటాము. మణిపూర్ ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పాటు బాంగ్లాదేశ్‌తో కూడా సరిహద్దులు కలిగి ఉంది. అంతా గిరిజన మయం. ఎంత సున్నితమైన ప్రాంతమో వేరేగా చెప్పాల్సినపనిలేదు కదా! కానీ, బీజేపీవారు మాత్రం అంత మొరటుగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పటికే మణిపూర్ ప్రభావం పక్క రాష్ట్రమైన మిజోరంపై పడింది. ఆ రాష్ట్రంలో నిరసన జ్వాలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. వేలాదిమంది జనం రోడ్లపైకి వచ్చి మణిపూర్ సంఘటనపై ఉద్యమిస్తున్నారు.

1972లో ఓ రాష్ట్రంగా అవతరించిన మణిపూర్‌లో 'మైతేయ్' తెగవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. బీజేపీ భాషలో చెప్పాలంటే వీరు మెజారిటీ తెగ. అత్యధికులు హిందువులు. కేవలం 30 లక్షలకు అటూ ఇటూగా ఉన్న మణిపూర్ జనాభాలో వీరు 53–55 శాతం ఉంటారు.



వివిధ నాగా జాతులు, మిగిలిన తెగలు ఓ 24 శాతం ఉంటే, 'కుకి' అనే గిరిజన తెగవారు ఓ 16–18 శాతం ఉంటారు. అంటే.. బీజేపీ భాషలో మైనారిటీ అన్న మాట. అంటే ఎస్‌టీలు. పర్వత ప్రాంత సానువుల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని, వ్యవసాయం చేసుకుంటూ వీరు జీవిస్తూ ఉంటారు. ఈ రాష్ట్రంలో హైందవం... క్రైస్తవం మధ్య అత్యధిక సంఖ్యాకులు చీలిపోయి ఉన్నారు. మైతేయ్‌లలో అత్యధికులు హిందూ మతం అనుసరిస్తే, కుకి తెగలో ఎక్కువమంది క్రైస్తవాన్ని ఆశ్రయించారు.

1960 ప్రాంతాలలో 65 శాతం వరకూ ఉన్న హిందువులు, 2011 జనాభా లెక్కల నాటికి 42 శాతానికి చేరుకుంటే, క్రైస్తవుల జనాభా 19 శాతం నుంచి ఇప్పుడు 45 శాతానికి చేరుకుంది. అంటే.. మెజారిటీ మతస్తుల సంఖ్య తగ్గుతుంటే, మైనారిటీ మతస్తుల సంఖ్య పెరిగిపోతోంది.

ఇదీ మణిపూర్ అల్లర్లు, విధ్వంసం, గృహ దహనాలు, మాన భంగాలు, హత్యలు యధేచ్ఛగా, నిరాఘాటంగా, నిర్భీతిగా, నిస్సిగ్గుగా, నిర్లజ్జగా, నిర్హేతుకంగా బహిరంగంగా జరిగిపోతూ ఉండడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు అంటుంటారు. ఈ మైతేయ్ వారు పొడవడానికి కావలసిన కత్తులు, కాల్చడానికి కావలసిన తుపాకులు, మనుషుల మీద... ఇళ్ల మీద చల్లడానికి అవసరమైన పెట్రోలు, నిప్పు పెట్టడానికి కావాల్సిన అగ్గిపెట్టె, తరవాత పారిపోవడానికి వాహనాలు మొదలైనవన్నీ సమకూరడానికి అక్కడి అధికార యంత్రాంగమే సాయపడుతుందా అనే అనుమానాలు ప్రతిపక్షాలను పీడిస్తున్నాయి.

అయినా నరేంద్ర మోడీ నోరు విప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే అయినా, మోడీ నోరు విప్పుతారేమో అని ప్రతిపక్షాలు కలలు కంటున్నాయి.

మణిపూర్ అనే కాదు. దేశంలో ఎక్కడ అయినప్పటికీ మెజారిటీ మతం వారి చేతుల్లో మైనారిటీ ప్రజలు ఇబ్బందులకు గురి అయితే, వాటిని ఆయన కనరు. వినరు. పెదవి విప్పరు.

మరి, మణిపూర్‌లో కుకి తెగ వారికి మైతేయ్ జాతి వారి చేతుల్లోంచి విముక్తి ఎప్పుడు? 'మైతేయ్ పక్షపాతిగా ముద్రపడిన బీజేపీ ముఖ్యమంత్రిగా ఉన్న బైరెన్ సింగ్... తన పదవికి రాజీనామా చేసినప్పుడు' అని ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాలు పరిశీలించే వారు అంటున్నారు.

కానీ, ఆయనను పల్లెత్తు మాట అనడానికి బీజేపీ సిద్ధంగా లేదు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు.

ఇందుకు ఉదాహరణ మన కిషన్‌రెడ్డే.

ఆయన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి. ఇది చాలదన్నట్టుగా, ఈశాన్య రాష్ట్రాలలో అభివృద్ధి.... పర్యవేక్షణ మంత్రి కూడా. అయినప్పటికీ మణిపూర్‌ను ఆయన ఒక్కసారి కూడా సందర్శించలేదు. అక్కడి ముఖ్యమంత్రితో చర్చించలేదు. అసలు సమస్య ఏమిటని గానీ, పరిష్కారమార్గం ఏమిటని గానీ కిషన్‌రెడ్డి అక్కడి అధికార యంత్రాంగంతో చర్చించలేదు.

కానీ, తెలంగాణలో బీజేపీ అనే దానిని భుజంపై వేసుకుని విక్రమార్కుడి లాగా... భారంగా... ఎన్నికల వైపు నడుచుకుంటూ వెళుతున్నారు.

ఈ కామెడీ చూసిన ఆంధ్రజ్యోతి విలేకరి ఒకరు, కిషన్‌రెడ్డిని "మణిపూర్ ఇష్యూ పై ఏమంటారు?" అని అడిగారు. కిషన్‌రెడ్డి ఇంతెత్తున ఆ విలేకరిపై విరుచుకుపడ్డారు.

"మణిపూర్‌కి... నాకూ ఏమిటి సంబంధం? ఏం ప్రశ్న ఇది" అంటూ చిరాకు పడిపోయారు. మరి, ఆయనేమో.... ఈశాన్య రాష్ట్రాల పర్యవేక్షక మంత్రి.

మణిపూర్‌లో అల్లర్లు, విధ్వసం మొదలైన ఈ మూడు నెలల్లో దాదాపు 145 మంది వరకు చనిపోయినట్టు చెబుతున్నారు. వారి స్మృతికి శ్రద్ధాంజలి ఘటిద్దాం. మైతేయ్‌లే కాదు... వారూ భారతీయులే.

మంత్రులుగానో, ముఖ్యమంత్రులుగానో, ఎం.పీలు, ఎంఎల్‌ఏలుగా పదవులేమో... జీతభత్యాలు, ప్రభుత్వ బంగాళాలు, పీఏలు, పీఎస్‌లు, గన్‌మెన్‌లు, వై.... వై ప్లస్, జెడ్, జెడ్ ప్లస్ సెక్యూరిటీ, విమానాల్లో ఫ్రీగా తిరుగుళ్ల కోసం. చేసేదేమో పార్టీ ప్రమోషన్ పనులు!

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com



# శ్రీసిటీలో మోండెలెజ్ ఇండియా అదనపు ప్లాంట్

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన జగన్
- అదనపు పెట్టుబడిగా రూ.1,600 కోట్లు
- ప్రత్యక్షంగా 500 మందికిపైగా ఉపాధి
- పరోక్షంగా 18వేల మంది రైతులకు లబ్ధి

తమ ఉత్పత్తుల కర్మాగారం ద్వారా ఇప్పటికే శ్రీసిటీలో అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న మోండెలెజ్ ఇంటర్నేషనల్ తమ అనుబంధ సంస్థ 'మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ (గతంలో క్యాడ్‌బరి ఇండియా లిమిటెడ్) అదనపు ఉత్పత్తి కేంద్రానికి సీఎం వై.ఎస్. జగన్ జులై 25వ తేదీ, మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రూ.1,600 కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో యూనిట్‌ను విస్తరణకు వెళ్తున్న మోండెలెజ్ ఇండియా బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. కొత్త యూనిట్ ద్వారా 500 మందికి పైగా నేరుగా ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రంలోని 18వేల మంది రైతులకు పరోక్షంగా ప్రయోజనం చేకూరనుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి చేస్తున్న కృషిని సీఎం జగన్ కొనియాడారు.

ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీలో ఇది ముఖ్యమంత్రి వర్చువల్‌గా పాల్గొన్న రెండవ కార్యక్రమం అని అన్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్లాంట్ విస్తరణ చేయాలన్న మోండెలెజ్ ఇండియా నిర్ణయాన్ని రవిరెడ్డి అభినందించారు.

క్యాడ్‌బరీ డైరీ మిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి ప్రసిద్ధ బ్రాండ్‌లతో ఇప్పటికే శ్రీసిటీలో రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టి, వందలాది ఉద్యోగాలు కల్పించిన మోండెలెజ్ ఇండియా, ఇప్పుడు భారతదేశంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అదనపు యూనిట్‌ను నిర్మించేందుకు మరో రూ.1,600 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ పెట్టుబడి ద్వారా వచ్చే మూడు సంవత్సరాలలో అదనపు చాక్లెట్ తయారీ సామర్థ్యాన్ని జోడించనుండడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మోండెలెజ్ ఇంటర్నేషనల్ యొక్క అతిపెద్ద చాక్లెట్ ఉత్పత్తి ప్లాంట్‌లలో ఒకటిగా శ్రీసిటీ అవతరించనుంది. మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ భారతదేశంలో 75 సంవత్సరాలకుపైగా ఉంది. దేశవ్యాప్తంగా విస్తారమైన పంపిణీ నెట్‌వర్క్ వుంది. కంపెనీ 1948లో భారతదేశంలో క్యాడ్‌బరీ డైరీమిల్క్ మరియు బోర్న్‌విటాను ప్రవేశపెట్టింది. అప్పటినుండి దేశంలో చాక్లెట్ విభాగంలో అగ్రగామిగా ఉంది. భారతదేశంలో చాక్లెట్, పానీయాలు, బిస్కెట్లు, మిఠాయిలు తయారు చేయడంలో ఈ సంస్థ ప్రఖ్యాతి గాంచింది.

# జొన్నవాడ కామాక్షితాయికి కుంకుమ పూజలు

## కోటికుంకుమార్చనలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో వైభవంగా జరుగుతున్న కోటి కుంకుమార్చనలో భాగంగా నాల్గవ రోజైన ఈనెల 22న రాజ్యసభ సభ్యులు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. టిటిడి ఉత్తరభారత ఆలయాల స్థానిక సలహా మండలి-న్యూఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. కోటికుంకుమార్చన మహాయజ్ఞానికి ఉభయ కర్తలైన వీరిని తొలుత ఆలయ అర్చకులు సాదరంగా ఆహ్వానించారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న తరువాత అర్చకులు నిర్వహించిన నవావరణ పూజలు, గోపూజ, వృషభార్చన, లక్ష్మీగణపతి పూజ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం తదితర పూజల్లో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలివారు, అధికారులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

# ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించాలి

## రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఆనందరావ్ పాటిల్



గూడూరు రైల్వే జంక్షన్‌లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుడుతున్నట్లు విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఆనందరావ్ పాటిల్ తెలిపారు. బుధవారం ఇతర అధికారులతో కలసి ప్రత్యేక రైలులో గూడూరుకు వచ్చిన ఆయన రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మాణంలోఉన్న ఆర్వోఆర్ పనులు పరిశీలించారు. ఆయా విభాగాలను తనిఖీచేసి స్టేషన్‌లో పరిశుభ్రత, ప్రయాణీకుల భద్రత, మౌలిక వసతులు తదితర వాటిపై ఆరా తీశారు. ప్రయాణీకుల నిరీక్షణ గదిని తనిఖీచేసి మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం కృష్ణపట్నం పోర్టుకు వెళ్లారు. రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, డివిజన్ అధికారులు నరేంద్రవర్మ, రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 'మహాధర్నా'లో బిఎంఆర్




కరెన్సీ నోట్లపై బిఆర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూలై 26వ తేదీ బుధవారం నాడు జరిగిన ధర్నాలో రాజ్యసభసభ్యులు బీద మస్తాన్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మరో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, సామాజిక కార్యకర్త రామ్‌దాస్ అథవాలే, జర్రిపోతుల పరుశురాం, పలు రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ కిషోర్స్ రోషిని రత్నం హైస్కూల్‌లో

# కార్గిల్ 'విజయ్ దివాస్'



చిన్నారులకు పాఠ్యాంశాలు బోధించడంతో పాటు దేశభక్తిని పెంపొందించడం కూడా చాలా అవసరం. ఇలాంటి కార్యక్రమాలు అమలు చేయడంలో ఎప్పుడూ ముందుండే డాక్టర్ కిషోర్స్ రత్నం హైస్కూలు యాజమాన్యం జులై 26న 'కార్గిల్ విజయ్ దివాస్'ని జరుపుకుంది. డాక్టర్ కిషోర్స్‌రోషిని రత్నం హైస్కూలులో జరిగిన ఈ కార్గిల్ విజయదినోత్సవ వేడుకలో విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ జెండా రంగులతో కార్గిల్ వీరుల చిత్రపటాలను ప్రదర్శించారు. పుష్పగుచ్ఛాలతో, కొవ్వొత్తులతో కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పించారు. అమరులైన సైనిక వీరులపై రూపొందించిన పాటలను పాడారు. అనేకమంది విద్యార్థులు సైనికుల వేషధారణలో సాటి విద్యార్థులను, అధ్యాపకులను ఉత్తేజపరచారు. సంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ, తమ కుటుంబాలను సైతం వదిలిపెట్టి, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సంరక్షణ కోసం ఎముకలు కొరికే చలిలో పనిచేస్తున్న సైనికుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లతో పాటు జనరల్‌మేనేజర్ రామ్మూర్తి నాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తృతీయ వర్ధంతి



జననం 01.07.1938
మరణం 01.08.2020

మా ఇంటి దైవం, మాకు మార్గదర్శకులు
కీ॥శే॥ కైపు నాగిరెడ్డి గారు
పరమపదించి తేది.01.08.2023ది నాటికి
మూడేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

భార్య - కైపు రాజేశ్వరమ్మ
కుమారుడు - కైపు మల్లిఖార్జునరెడ్డి
రాంజీనగర్, నెల్లూరు.
PORTLAND, USA.
మరియు కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com